

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

ఆదివారం 13, సెప్టెంబర్ 2026 16 పేజీలు

అహో... లంభోధర!



- వినాయకుడి ధరలు విపరీతంగా పెరిగిన
- విగ్రహాలకు పెరిగిన మరింత డిమాండ్
- మండపాల నిర్వహణకు అధిక వ్యయం
- విగ్రహాల తయారీదారులకు కాసుల వర్షం

కరీంనగర్ బిజినెస్, ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. గణనాథుడి విగ్రహాల తయారీ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఈసారి వినాయక విగ్రహాల ధరలు గణనీ యంగా పెరిగాయి. మట్టి, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలతో పాటు విగ్రహాల తయారీ కూలీ వ్యయం పెరగడంతో ధరలు పెరిగినట్లు తయారీ దారులు చెబుతు న్నారు. అయినప్పటికీ ఉత్సవాల నిర్వహణలో వినాయక విగ్రహాల గిరాకీ ఏమాత్రం తగ్గడం లేదు.

2లో

ఓబీ తొలగింపునకు మరింత వేగం

రోజుకు 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యం.. ఆఫ్‌లోడింగ్ సంస్థలు పనితీరు పెంచాలి

యంత్రాల సంఖ్యపై ప్రత్యేకంగా సమీక్ష.. కొత్త గనుల టెండర్ల ప్రక్రియ వేగవంతం

గోదావరిఖని, ప్రభాతవార్త: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాను పెంచేందుకు ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను మరింత వేగవంతం చేయాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశిం చారు. సవరించిన లక్ష్యాలను రోజువారీగా సాధించాల్సిం దేనని అన్ని ఏరి యాల జనరల్ మేనేజర్లకు స్పష్టం చేశారు.సింగరేణి సంస్థ పరిధిలోని 15 ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు పనులు చేపడుతున్న 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల పనితీరుపై శనివారం సింగరేణి భవన్‌లో సీఎండీ సమీక్ష నిర్వ హించారు.



2లో

చినుకు జాడేది?

కర్షకులపై కనికరమేది!



- సాగునీరు లేక ఎండుతున్న పంటలు
- మధ్యమానేరు కుడికాలువ నుంచి నీటి విడుదల కోసం రైతుల ఎదురుచూపు
- నీరందక పెట్టుబడులు ఆవిరయ్యే పరిస్థితి
- పంట చేతికొచ్చే వేళ నీటి కోసం అన్నదాతల ఆందోళన

2లో

ఇల్లంతకుంట, ప్రభాతవార్త: సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. పంటలకు కీలకమైన దశలో నీటి కొరత ఏర్పడటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం నీరే ప్రాణాధా రంగా మారింది. కాలువ ద్వారా సాగునీరు విడుదల కాకపోవడంతో పంటలు కళ్లముందే వాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని కిష్టారావుపల్లె, వల్లంపట్ల, రంగంపేట, తెనుగువారిపల్లి, వంతడుపుల, గాలిపెల్లి తదితర గ్రామాల పరిధిలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పంటకు నీటి అవసరం అధికంగా ఉన్న సమయంలో కాలువ ద్వారా నీరు అందకపోవడంతో పాలాల్లో తేమ తగ్గి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రైవేటుగా నీటిని సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నా ఖర్చులు మరింత పెరుగుతున్నాయని వాపోతున్నారు.

కర్షకులపై కనికరమేది!

సాగునీరు లేక ఎండుతున్న పంటలు
మధ్యమానేరు కుడికాలువ నుంచి
నీటి విడుదల కోసం రైతుల ఎదురుచూపు
అప్పులు చేసి సాగు.. నీరందక పెట్టుబడులు ఆవిరయ్యే పరిస్థితి
పంట చేతికొచ్చే వేళ నీటి కోసం అన్నదాతల ఆందోళన

ఇల్లంతకుంట, ప్రభాతవార్త: సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. పంటలకు కీలకమైన దశలో నీటి కొరత ఏర్పడటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం నీరే ప్రాణాధారంగా మారింది. కాలువ ద్వారా సాగునీరు విడుదల కాకపోవడంతో పంటలు కళ్లముందే వాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని కిష్టారావుపల్లె, వల్లంపట్ల, రంగంపేట, తెనుగువారిపల్లి, వంతడుపుల, గాలిపెల్లి తదితర గ్రామాల పరిధిలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పంటకు నీటి అవసరం అధికంగా ఉన్న సమయంలో కాలువ ద్వారా నీరు అందకపోవడంతో పొలాల్లో తేమ తగ్గి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రైవేటుగా నీటిని సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నా ఖర్చులు మరింత పెరుగుతున్నాయని వాపోతున్నారు.

కుడికాలువే దిక్కు

మధ్యమానేరు కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేస్తే ఆయా గ్రామాల పరిధిలోని పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కాలువకు సమీపంలోనే ఉన్నా తమ పొలాలకు నీరు అందకపోవడం దురదృష్టకరమని అంటున్నారు. పంట సాగు కోసం ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని, ప్రస్తుతం నీరు అందకపోతే మొత్తం పెట్టుబడి నేలపాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కుడికాలువకు నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడుకోవచ్చని విజ్ఞప్తి చేస్తున్నారు.

పలుమార్లు ఆందోళనలు

సాగునీటి కోసం ఆయా గ్రామాల రైతులు గతంలో పలుమార్లు ఆందోళనలకు దిగారు. రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరు అందించాలని ఎన్నిసార్లు విన్నవించినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతిసారీ అధికారులు హామీలు ఇవ్వడం, ఆ తర్వాత పరిస్థితి యథాతథంగా మారడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు.ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నందున మరోసారి ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అంటున్నారు. రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కళ్లముందే పంట ఎండుతున్నా..

రైతులు రక్తాన్ని చెమటగా మార్చి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులు పెరిగిపోతుండగా.. మరోవైపు సాగునీరు అందకపోవడంతో రైతులపై ఆర్థిక భారం మరింత పెరుగుతోందని చెబుతున్నారు.సాగునీటి కోసం రైతులు ఎన్నిసార్లు అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో అన్నదాతల్లో నైరాశ్యం నెలకొంది. పంటలు ఎండిపోయిన తర్వాత నీరు విడుదల చేసినా ప్రయోజనం ఉండదని, ఇప్పుడే నిర్ణయం తీసుకుని కాలువకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

అప్పులు చేసి సాగు..

పంట సాగు కోసం పెట్టుబడి పెట్టిన రైతుల్లో చాలామంది అప్పులు చేసి వ్యవసాయం చేపట్టారు. పంట చేతికొచ్చి ఆదాయం వస్తే అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో సాగు చేసిన వారికి ప్రస్తుతం నీటి సమస్య ఆందోళన కలిగిస్తోంది. పంట దెబ్బతింటే అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెబుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సాగునీటి సమస్యను పరిష్కరించి పంటలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి

మధ్యమానేరు కుడికాలువకు వెంటనే నీటిని విడుదల చేసి ఆయా గ్రామాల పరిధిలోని పంటలకు సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలు పూర్తిగా ఎండిపోయేలోపే అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నీటి విడుదలపై స్పష్టత ఇవ్వడంతో పాటు తమ పంటలను కాపాడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి రైతులను ఆదుకోవాల్సి అని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి : మ్యాకల అనిల్, రైతు:



మూడు ఎకరాల్లో వరి నాట్లు వేశాను. ఇప్పటి వరకు పెట్టుబడి లక్ష రూపాయలు దాటింది. పంటకు ప్రస్తుతం నీరు ఎంతో అవసరం. సాగునీరు అందక ఎండిపోయే దశకు చేరుకుంది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. పంట చేతికొస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఉంది. అధికారులు స్పం దించి మధ్యమానేరు కుడికాలువ నుంచి వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాల్ని అని కోరారు.



ఓబీ తొలగింపునకు మరింత వేగం

రోజుకు 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యం
ఆఫ్‌లోడింగ్ సంస్థలు పనితీరు పెంచాలి
యంత్రాల సంఖ్యపై ప్రత్యేకంగా సమీక్ష
కొత్త గనుల టెండర్ల ప్రక్రియ వేగవంతం

గోదావరిఖని, ప్రభాతవార్త: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాను పెంచేందుకు ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను మరింత వేగవంతం చేయాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశించారు. సవరించిన లక్ష్యాలను రోజువారీగా సాధించాల్సిందేనని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు స్పష్టం చేశారు.సింగరేణి సంస్థ పరిధిలోని 15 ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు పనులు చేపడుతున్న 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల పనితీరుపై శనివారం సింగరేణి భవన్‌లో సీఎండీ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన మేరకు బొగ్గు అందించాల్సిన బాధ్యత సింగరేణిపై ఉందన్నారు. బొగ్గు ఉత్పత్తి పెంచాలంటే ముందుగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు లక్ష్యాలను సమర్థంగా సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

101 శాతం పురోగతి ....

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపును లక్ష్యంగా నిర్దేశించగా.. 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించి 101 శాతం పురోగతి సాధించినట్లు సీఎండీ తెలిపారు. ఈ కాలంలో సంస్థ మొత్తంగా లక్ష్యాన్ని అధిగమించినప్పటికీ కొన్ని ఆఫ్‌లోడింగ్ సంస్థలు నిర్దేశిత లక్ష్యాల మేరకు పనిచేయక పోవడంపై ఆయన దృష్టి సారించారు.19 ఆఫ్‌లోడింగ్ సంస్థల్లో ఆగస్టు నెలాఖరు వరకు కేవలం ఎనిమిది సంస్థలు మాత్రమే వంద శాతం లక్ష్యాలను సాధించాయని తెలిపారు. మిగిలిన సంస్థలు పనితీరును మెరుగుపరుచుకుని లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడటానికి కారణాలను గుర్తించి, అవసరమైన యంత్రా లు, సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు.

రోజుకు 12.1 లక్షల లక్ష్యం....

సెప్టెంబరు నెలకు తొలుత రోజుకు 7.28 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపును లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ.. పెరుగుతున్న బొగ్గు డిమాండ్ దృష్ట్యా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లకు పెంచినట్లు సీఎండీ వెల్లడించారు. పెంచిన లక్ష్యాన్ని అనుగుణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు జరగాలని స్పష్టం చేశారు.జేవీఆర్ ఓసీ, మణుగూరు ఓసీ, జీడీకే ఓసీ, ఆర్జీ ఓసీ3, ఆర్జీ ఓసీ2, కేటీకే ఓసీ2, శ్రీరాంపూర్ ఓసీల్లో ఓబీ తొలగిస్తున్న కొన్ని ఆఫ్‌లోడింగ్ సంస్థలు లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నట్లు సమీక్షలో గుర్తించారు. ఇప్పటికే ఏర్పడిన లోటును భర్తీ చేయడంతోపాటు తాజాగా నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను కూడా చేరుకోవాలని సీఎండీ సూచించారు.

యంత్రాలపై ప్రత్యేక దృష్టి .....

లక్ష్యాల సాధనకు అవసరమైన యంత్రాల లభ్యతపైనా సమావేశంలో సవివరంగా సమీక్షించారు. ప్రతి ఆఫ్‌లోడింగ్ సంస్థ ఎన్ని షవల్స్, ఎన్ని డంపర్లను వినియోగిస్తోంది? ప్రస్తుత లక్ష్యాలను సాధించేందుకు ఇంకా ఎన్ని యంత్రాలు అవసరం? అనే అంశాలను సీఎండీ పరిశీలించారు. ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా యంత్రాల వినియోగ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్‌లోడింగ్ టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలస్యం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేసి ఓబీ తొలగింపు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమీక్ష సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్‌తో పాటు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



అహో... లంబోధర!

విపరీతంగా పెరిగిన వినాయకుడి ధరలు
భారీ విగ్రహాలకు పెరిగిన మరింత డిమాండ్
మండపాల నిర్వహణకు అధిక వ్యయం
విగ్రహాల తయారీదారులకు కాసుల వర్షం

కరీంనగర్ బిజినెస్, ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. గణనాథుడి విగ్రహాల తయారీ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఈసారి వినాయక విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగాయి. మట్టి, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలతో పాటు విగ్రహాల తయారీ కూలీ వ్యయం పెరగడంతో ధరలు పెరిగినట్లు తయారీదారులు చెబుతున్నారు. అయినప్పటికీ ఉత్సవాల నిర్వహణలో వినాయక విగ్రహాల గిరాకీ ఏమాత్రం తగ్గడం లేదు.

ఈపరితంగా పెరిగిన వినాయకుడి ధరలు....

వినాయక విగ్రహాల తయారీకి గుజరాత్, బీహార్, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు జిల్లా కేంద్రంలో కొంత స్థలాన్ని లీజుకు తీసుకొని సంవత్సరం పాటు వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉంటారు. విగ్రహాల తయారీ వ్యయం, ఖర్చులు రోజురోజుకు పెరగడంతో విగ్రహాల అమ్మకం ధర కూడా పెరిగిందని తయారీదారులు చెబుతున్నారు. ఇంటిలో ప్రతిష్టించే విగ్రహాలు ఒక వెయ్యి రూపాయల నుంచి 20వేల రూపాయల వరకు ధర 20పలుకుతున్నాయి. మండపాలలో ప్రతిష్టించే విగ్రహాలు సుమారు 20వేల రూపాయల నుంచి ప్రారంభమై విగ్రహ పరిమాణాన్ని, తయారీ విధానాన్ని బట్టి లక్షలు దాటుతోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి వినాయకుడి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

భారీ విగ్రహాలకు పెరిగిన మరింత డిమాండ్...

ప్రతి ఏటా నిర్వహించే మండపాలకు ఈసారి కూడా భారీ విగ్రహాలనే ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాదితో పోలిస్తే విగ్రహాల ధరలు పెరిగినప్పటికీ ముందస్తు బుకింగ్‌లు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రత్యేక ఆకృతులు, భారీ విగ్రహాలు, ఆకర్షణీయమైన రంగులు, ప్రత్యేక అలంకరణలతో రూపొందించిన గణనాథులకు డిమాండ్ అధికంగా కనిపిస్తోంది. యువజన సంఘాలు, కాలనీ సంఘాలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసే మండపాలలో భారీ విగ్రహాలను ప్రతిష్టించేందుకే ముగ్గు చూపుతున్నారు. ఒకరితో ఒకరు పోటీపడి మరి ముందస్తు పథకం ప్రకారం భారీ స్థాయిలో విగ్రహాలను తయారు చేయించుకున్నారు.



మండపాల నిర్వహణకు అధిక వ్యయం...

విగ్రహం కొనుగోలుతోనే ఉత్సవాల ఖర్చు పూర్తికాదు. మండపం ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, మైక్ సిస్టమ్, పూజా సామగ్రి, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం తదితరాలకు భారీగా ఖర్చవుతోంది. అందుకు నిర్వాహకులు ముందుగానే చందాల సేకరణ చేపడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ప్రజలు, భక్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవైపు పెరుగుతున్న ధరలు నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తుండగా, మరోవైపు ఉత్సవాలపై ఉన్న ఉత్సాహం వారిని ముందుకు నడిపిస్తోంది

విగ్రహాల తయారీదారులకు కాసుల వర్షం....

సంవత్సరం అంతా కష్టపడి విగ్రహాలను తయారుచేసి వినాయక చవితిని పురస్కరించుకొని అమ్మకం కొనసాగిస్తున్న విగ్రహాల తయారీదారులకు ఈ సీజన్ కాసుల పంటగా చెప్పుకోవచ్చు. నేరుగా తయారుదారులే అమ్ముకోవడం వల్లవారికి అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. కానీ మధ్యవర్తి, కాంట్రాక్టర్, రిటైలర్ ద్వారా అమ్మే వినాయకుల వ్యాపారం వల్ల ఆశించిన స్థాయిలో లాభం రావడం లేదని, నిర్దేశించిన జీతానికి వారు పనిచేయాల్సి వస్తుందని వాపోతున్నారు. వినాయక చవితి విగ్రహాల అమ్మకంలో కాసుల గలగల, విగ్రహాల తయారీదారులకు, అమ్మకందారులకు ఆనందాన్నిస్తోంది.

తల్లి కొడుకుల ఆత్మహత్యకు దారితీసిన ఫైనాన్స్ కంపెనీల పై చర్యలు తీసుకోవాలి

మృతుల కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, రవిశంకర్

మల్యాల, ప్రభాతవార్త: మల్యాల మండల కేంద్రం కు చెందిన గుండేటి కవిత తన ఏడేళ్ల కుమారుడు శశాంకతో సహా ఆర్థిక బాధలు భరించలేక బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన లో ఇబ్బందులకు గురిచేసిన ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ లు డిమాండ్ చేశారు,శనివారం వారు మల్యాల లోని మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 ఆర్థిక సహాయం అందజేశారు, ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను తెలుసుకున్నారు, అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కవిత ఆత్మహత్యకు దారి తీసిన ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి మహిళా సంఘం నుండి పొందిన రుణం మాఫీ చేసి, ప్రభుత్వం 10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీ ఐ రాజ్ కుమార్ కి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఫోన్ లో సూచించారు, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కవిత కుటుంబానికి, ఆమె పెద్ద



కుమారుడు నిఖిలేష్ చదువులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు, కార్యక్రమంలో మాజీ సింగిల్ చైర్మన్ సాగర్ రావు, నాయ కులు దొంతర వేణి శేఖర్, మిట్టపల్లి దశరథం, జవ్వాజి శ్రీనివాస్ ఎండి సలీం కటుకూరి అరుణ్, పోచంపల్లి నవీన్, మునుగురి రంజిత్, చందు, అలంకార్, రెడ్డి పాల్గొన్నారు.



వినాయక మండపాల్లో నిబంధనలు పాటించాలి

చందుర్తి,సెప్టెంబరు 12 : ప్రభాతవార్త వినాయక మండపాల్లో నిర్వాహకులు పోలీస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని పెరిక కళ్యాణ మండపంలో శనివారం వినాయక మండపా లనిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు భద్రత, శాంతిభద్రతలు దెబ్బ తినకుండా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా డీజేలు పెట్టకూడదన్నారు. వాటికి అనుమతులు లేదన్నారు. మండపాలతో పాటు విద్యుత్ ఏర్పాట్లలో రక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల న్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన దానికి నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ వినియోగ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో చందుర్తి సీఐ రవీందర్.ఎస్ఐ రమేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

పలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త మండలంలో శనివారం నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని కరీంనగర్ అదనపు కలెక్టర్,ఈ ఆర్వో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.మండల కేంద్రముతో పాటు ముస్కానిపేట కేంద్రాలను సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.కొత్త



ఓటర్ల నమోదు,మార్పులు,చేర్పులు,తొలగింపులకు సంబంధించిన దరఖా స్తుల స్వీకరణ తీరును పరిశీలించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా బూత్ స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాచకట్ల సురేష్,బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భారంతో ఉరి వేసుకొని వ్యక్తి మృతి



ఎండపల్లి ప్రభాతవార్త జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన సింహాచలం జగన్, వయస్సు: 48 సంవత్సరాలు, ఇంటి అవసరాలు కొరకు చాలామంది దగ్గర అప్పులు చేసినాడు. దాంతో అప్పుల భారంతో జీవితం పై విరక్తి చెంది ఇంట్లో స్లాబ్ పిల్లర్ కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని మరణించినాడని మృతుని భార్య సింహాచలం పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల కొరకు మృతదేహాన్ని తన బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుంది.

అప్పుల భారంతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య

ప్రజాసేవలో ముందుండిన యువ నాయకుడి విషాదాంతం

భార్యాపిల్లలను ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సూసైడ్ నోట్‌లో వేడుకోలు

ఎండపల్లి, ప్రభాతవార్త: అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మన స్తాపానికి గురైన గుల్లకోట మాజీ సర్పంచ్ సింహా చలం జగన్ (48) ఆత్మహ త్యకు పాల్పడిన ఘటన ఎండపల్లి మండలం గుల్ల కోటలో శనివారం విషాదం నింపింది. పీఎంపీ వైద్యు



డిగా రెండు దశాబ్దాలుగా గ్రామస్థులకు సేవలందించిన జగన్.. అనంతరం రాజకీయాల్లోకి వచ్చి వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా పనిచేశారు.బీఆర్ఎస్‌లో చురుకైన నాయకుడిగా కొనసాగిన ఆయన ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రధాన కార్యదర్శిగా, అనంతరం ఎండపల్లి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే అప్పుల భారంతో కొంతకాలంగా తీవ్ర ఆవేదనకు గురైనట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం సోషల్ మీడియాలో సూసైడ్ నోట్ ద్వారా తన ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించిన ఆయన.. తన భార్యాపిల్లలను ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులను కోరినట్లు సమాచారం.

కన్నీరుమున్నీరుగా కుటుంబం

జగన్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామ ప్రజలతో సన్నిహితంగా మెలిగిన నాయకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పార్థివదేహానికి నివాళి

విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గుల్లకోటకు చేరుకుని జగన్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ జెండా ను పార్థివదేహంపై ఉంచి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

డిఎల్ఎస్ఏ ప్రశంసా పత్రం బహూకరణ

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారి నాగని రాజేందర్ కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.లోక్ అదాలత్ న్యాయ సేవల విభాగంలో కేసుల త్వరితగతిన పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ సమర్థవంతంగా అమలు కావడానికి విశేష కృషి చేసినందుగానూ కరీంనగర్ పోలీస్ శాఖకు చెందిన అధికారి ఎన్. రాజేందర్ కు ఈ పురస్కా రాన్ని అందజేశారు. జిల్లా న్యాయమూర్తి శివకుమార్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని, సదరు అధికారికి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నేరాలు-దారుణాలు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు..

గంగాధర,ప్రభాతవార్త: గంగాధర మండలం లోని ఒడ్డ్యారాం గ్రామ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయస్సు దాదాపు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, మృతుడి వివరాలు,ఆచూకీపై విచారణ చేపట్టారు.మృతుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు ఉన్నట్లయితే గంగాధర పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు .సమాచారం తెలిసిన వారు గంగాధర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మొబైల్ నెంబర్ 8712670768 తెలియజేయగలరని ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని టీ వ్యాపారి మృతి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ టీ వ్యాపారి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధరూర్ గ్రామానికి చెందిన తిరుమల గంగాధర్ తన గ్రామంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో టీ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.ప్రతిరోజూ లాగే తెల్లవారుజామున ఇంటి నుండి సైకిల్‌పై పాల ప్యాకెట్లు తీసుకుని టీ షాప్‌కు వెళ్తుండగా, ధరూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పై ఈ ప్రమాదం జరిగింది.వెనుక వైపు నుండి వస్తున్న టిజి21జెడ్ 0041 నంబరు గల ఆర్టీసీ బస్సు డ్రైవర్ సత్యనారాయణ వాహనాన్ని అతివేగంగా,అజాగ్రత్తగా నడిపి సైకిల్‌పై వెళ్తున్న గంగాధర్‌ను ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో తలకు, ఇతర అవయవాలకు తీవ్ర గాయాలైన గంగాధర్‌ను వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచాడు. మృతుడికి ఒక కుమారు డు,ఒక కుమార్తె ఉన్నారు.ఈ ఘటనపై మృతుడి కుమారుడు తిరుమల అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిలింగ్‌తో వృద్ధుల కేసులు పరిష్కారం

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: జిల్లా లోని జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల డివిజన్ల మండలాలకు చెందిన నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రుల ఫిర్యాదులపై వారి కొడుకులు, కూతుర్లు, కోడళ్ళను శనివారం కౌన్సిలింగ్ కేంద్రం కు పిలిపించి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యం లో అసోసియేషన్ ప్రతినిధులు వృద్ధుల చట్టం శిక్షలను, వారు తల్లి దండ్రుల నుంచి పొందిన ఆస్తులు తిరిగి వారి పేరిట మార్చే వీలుందని వివరిస్తూ కౌన్సిలింగ్ చేయడంతో వారు స్పందించి తమ తల్లి దండ్రులను పోషణ, రక్షణ బాగోగులు మా భాద్యతేనని అఫిడవిట్స్ సమర్పించి వెంట తీసుకెళ్లారు.తమ సమస్యలు పరిష్కరించిన హరి అశోక్ కుమార్ కు ఆ వృద్ధ తల్లి దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కౌన్సిలింగ్ లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,ప్రతినిధులు పి. సీ. హన్మంత్ రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథము, వెల్ముల ప్రకాష్ రావు, ఎం. డి. యాకూబ్ , కండ్ల గంగాధర్,విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

కారు ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి సెప్టెంబరు 12 ప్రభాతవార్త చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యా యి. స్థానికుల కథనం ప్రకారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన మోండ య్య అనే వ్యక్తి బైక్ పై వేములవాడకు వస్తుండగా వేములవాడకు చెందిన సత్యనారాయణ మూడపల్లిలో వెంక టేశ్వర స్వామి ఆలయంలో దర్శనం చేసుకొని కారులో వెళ్తున్న సమయం లో కారు బైకు ఢీకొన్నాయి ఈ సంఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న మొండయ్య కే గాయాల య్యాయి. మొండయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో వేముల వాడ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపడుతున్నారు,



జాతీయ పవర్‌లిఫ్టింగ్‌లో రోహిత్ మెరుపు

ఢిల్లీలో జరిగిన పోటీల్లో రజత పతకం కైవసం

కఠోర సాధనతో జాతీయ స్థాయిలో సత్తా చాటిన కోరుట్ల యువకుడు



కోరుట్ల, ప్రభాతవార్త: కోరుట్ల పట్టణానికి చెందిన కల్లెడ రోహిత్ జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు. ఢిల్లీలో నిర్వహించిన సీనియర్ నేషనల్ పవర్‌లిఫ్టింగ్-నేషనల్ డెడ్‌లిఫ్ట్ అండ్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్ షిప్-2026లో రజత పతకం సాధించి కోరుట్లకు గర్వకారణంగా నిలిచారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు మేటి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రోహిత్ తన ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు.ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 8 నుంచి 11 వరకు ఢిల్లీలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పవర్‌లిఫ్టర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ రోహిత్ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శించారు. క్రమశిక్షణతో కూడిన ఆటతీరు, సాంకేతిక నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో పోటీ పడి రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు.

కఠోర సాధనకు ప్రతిఫలం

రోహిత్ సాధించిన ఈ విజయం వెనుక నిరంతర సాధన, కఠోర శ్రమ ఉన్నట్లు తెలుస్తోంది. శారీరక దృఢత్వంతో పాటు పవర్‌లిఫ్టింగ్‌లో అవసర మైన సాంకేతిక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ శిక్షణ పొందారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో సాధన కొనసాగిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకం సాధించడం విశేషం.జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడంతో కోరుట్ల పట్టణానికి చెందిన క్రీడాభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రోహిత్ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. క్రీడల్లో రాణించాలనుకునే యువత క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన విజయం నిరూపించిందన్నారు.

స్వర్ణమే లక్ష్యం

ఈ సందర్భంగా కల్లెడ రోహిత్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయం తనలో మరింత ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలిపారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో మరింత కష్టపడి సాధన చేసి స్వర్ణ పతకం సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.తన విజయానికి అండగా నిలిచిన కోచ్‌లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు రోహిత్ కృతజ్ఞతలు తెలిపారు. రోహిత్ జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడంపై పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

మధు యాష్కిని సన్మానించిన జువ్వాడి



కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రొఫెష నల్స్ కాంగ్రెస్ చైర్మన్ గా నియామ కమైన మాజీ లోక్ సభ సభ్యుడు మధుయాస్కి ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఘనంగా సన్మానించారు. హైదరాబాదులోని యాష్కి నివాసంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా మొదటిసారి హైదరాబాద్ వచ్చిన మధు యాస్కిని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్ప గుచ్ఛం అందజేశారు.

ఘనంగా ఉత్తర నక్షత్ర వేడుకలు



కోరుట్ల, ప్రభాతవార్త : అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు, మహిళలు , చిన్నారులు పాల్గొనగా ఆలయ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ గురుస్వామి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు గట్ల ఆనంద్, తులసి కృష్ణ, సహాయ కార్యదర్శులు శ్రీరాముల శ్రీనివాస్, కాసు క్రాంతి, ప్రచార, కార్యదర్శులు చలిగంటి వినోద్, నాగులమ్మ దేవాలయ అధ్యక్షులు ఉప్పరపల్లి నాగరాజు, బొమ్మ రాజేశం, గుడిసె కోటేష్ గురుస్వాములు రాజగోపాల్, క్యాతం వెంకన్న భీమనాతి నరేష్, వందలాదిమంది భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం



కోరుట్ల, ప్రభాతవార్త : పట్టణం లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గీత సత్సంగ్ వ్యవస్థాపకులు చీలమంతుల చత్రపతి ఆధ్వర్యం లో శ్రీరామరక్ష స్తోత్ర పారా యణం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వెంకటేశ్వర ఆలయంలో గత కొన్ని వారాలుగా ప్రతి శనివారం ఉదయం ఈ స్తోత్రం పారాయణం చేపడుతున్నామన్నారు. అనంతరం శ్రీరామచంద్రుని విగ్రహానికి పూలాబి షేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు బచ్చు శ్రీనివాస్, వనతడుపుల పవన్, అందే జనార్ధన్, ఎక్కల్దేవి శ్రీనివాస్, చెట్పల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు



పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

మేడిపల్లి, ప్రభాతవార్త : మేడిపల్లి తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా కొండాపూర్‌లో శనివారం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటంలో పేదలు, రైతులు, కూలీలు, మహిళలు చూపిన ధైర్యసాహసాలు, వీరత్వం, త్యాగాలు మరువలేనివని నాయకులు అన్నారు. దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు ఐక్యంగా పోరాడి, సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంచడం, 3,000 గ్రామాలను విముక్తి చేయడం, 4,500 మంది అమరుల త్యాగాలు వంటి విజయాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి చెరుకూరి రాజేశం, సీనియర్ నాయకులు ఏద్దండి భూమయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు చిట్యాల లక్ష్మణ్, బట్టు రాజయ్య, మండల కార్యదర్శి మునుగూరి హన్మంతు ,పార్వడ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు ఎదలాపురం దుబ్బరాజం,ఎదలాపురం గంగారాజం, పిట్టల నారాయణ, గంగ నరసయ్య, పల్లి రాములు చిలువేరి గంగాచారి, రాంపల్లి రవి, గంగు, లక్ష్మీ నరసవ్వ, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి

పెగడపల్లి, ప్రభాతవార్త: ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వ హించుకోవాలని మల్యాల సిఐ రాజకుమార్ పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శాంతియుత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. మండ పాల వద్ద విద్యుత్ వైర్లు, అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమ త్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచా రం ఇవ్వాలని సూచించారు. డీజేలు, లౌడ్‌స్పీకర్లతో అధిక శబ్దం చేయ కుండా నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ బాలు నాయక్, గణేష్ ఉత్సాహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



కోరుట్ల వార్త





ప్రజా నాయకుల చిత్ర పటాలకు పాలాభిషేకం

కథలాపూర్ ప్రభాతవార్త, వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలా పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కి గాను, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.96 కోట్ల నిధులను శుక్రవారం విడుదల చేసింది, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యం లో పాలాభిషేక చేశారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జగదీశ్వ ర్‌రావు, వాకిటి రాజారెడ్డి, కారపు గంగాధర్, అల్లం కొండ విజయ్, ఆకుల శంకర్, ఎండి ఆఫీస్, రమేష్ నాయక్, కథలాపూర్ మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అజీమ్, రాష్ట్ర పిసిసి కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జగిత్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ కథలాపూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, సర్పంచులు ముదం రవి, రంజిత్, రాజ గంగారం, ఉప సర్పంచ్ చెట్పల్లి ప్రసాద్, భూషణరావుపేట గ్రామ శాఖ అధ్యక్షుడు తలారి మోహన్, సోమి డి ప్రభుదాసులతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్వాహకులు నిబంధనలను పాటించాలి

కోరుట్ల, ప్రభాతవార్త : గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబం ధనలు పాటించాలని, భక్తి భావంతో వినాయక చవితి వేడుకలు నిర్వహిం చుకోవాలని మెట్పల్లి డీఎస్పీ రాములు సూచించారు. పట్టణం లోని వాసవి కల్యాణ భవనంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండ పాల వద్ద భక్తి భావంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజ్, గంగాధర్, మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, విద్యుత్ డీఈ మధుసూ ధన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండవ మెగా రక్తదాన శిబిరం విజయవంతం



కోరుట్ల టౌన్, ప్రభాతవార్త : శ్రీనివా సులు ఆ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ఒక సమూహంగా ఏర్పడి సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన డం ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, వేముల రవి కిరణ్, కోరుట్ల సరస్వతి శిశు మందిర్ లో శ్రీరాముల శ్రీనివాస్, గాండ్ల చంద్రం, నీలి శ్రీనివాస్, చిలుక శ్రీనివాస్, బెజ్జంకి శ్రీనివాసరావు, బెజ్జారపు శ్రీనివాస్, గాంధారి శ్రీనివాస్ అడ్వకేట్, తూమ్ శ్రీనివాసరావు, జాగిలం శ్రీనివాస్, ఉపాధ్యాయులు బండరికంటి శ్రీనివాస్, ఓడ్నాల శ్రీనివాసరావు ఓటుకూరి శ్రీనివాస్ వైద్య సిబ్బంది కోరుట్ల హాస్పిటల్ వైద్యులు ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రవీందర్ మృతి బీసీ ఉద్యమానికి తీరని లోటు జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

చిగురుమామిడి, ప్రభాత వార్త : చివరి శ్వాస వదిలే వరకు బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి గీకురు రవీందర్ అని, అలాంటి ఉద్యమ మరణం బీసీ ఉద్యమాలకు తీరనిలోటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు శనివారం చిగురుమామిడి మండలం కేంద్రంలో గీకురు రవీందర్ సంతాప సభకు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి గీకురు రవీందర్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం తన కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందుతుందని, కానీ సమాజం అంతా అభివృద్ధి చెందాలంటే ప్రజాసేవే మార్గమని భావించి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి సమాజ సేవ చేయడానికి సింగిల్ విండో డైరెక్టర్ గా, రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్ గా, చిగురుమామిడి మండలం జడ్పీటీసీగా పనిచేశాడని, ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేసి తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత బీసీ ఉద్యమంలో మమేకమై అత్యంత క్రియాశీలకంగా గీకురు రవీందర్ పనిచేశారని, హుస్నాబాద్ గడ్డపై బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ గెలుపు కోసం



కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగుల కనుకయ్య గౌడ్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, యువజన సంఘం అధ్యక్షుడు మాదాసు సంజీవ్, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, పీఏసీ చైర్మన్ చిటుమల్ల శ్రీనివాస్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన సంఘము రాష్ట్ర కార్యదర్శి గందే రమేష్, మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి చెల్పూరు విష్ణుమాచారి, గ్రామశాఖ అధ్యక్షులు సిరవేణి సంపత్, ముద్రవేణి కుమార్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆరెపల్లి మానస్ కుమార్



పెద్దపల్లి, ప్రభాతవార్త: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి యువజన నాయకుడు ఆరెపల్లి మానస్ కుమార్ ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు ఈనెల 8 నుంచి 10 వరకు యాదగిరిగుట్టలో నిర్వహించగా, ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆరెపల్లి మానస్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆరెపల్లి మానస్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ఏర్పడిన తరువాత ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం లేకుండా యువజన సంఘంలో చేరి 2017లో జిల్లా కన్వీనర్‌గా, 2020లో జిల్లా అధ్యక్షుడిగా, 2022లో జిల్లా కార్యదర్శిగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పోరాట ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించానన్నారు. యాదగిరిగుట్టలో జరిగిన ఈ రాష్ట్ర మహాసభలలో తనపై నమ్మకం ఉంచి వివిధ జిల్లాల ప్రతినిధులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తన ఎన్నికకు సహకరించిన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేనా శంకర్, పెద్దపల్లి సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంకు, విద్యార్థి యువజన నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

మూడు క్లిష్టమైన కేసులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా అందుబాటులో అధునాతన వైద్య సేవలు.... జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్



పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో మూడు క్లిష్టమైన కేసులకు విజయవంతమైన శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ స్పష్టం చేశారు. మంథని మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన 75 సంవత్సరాల వ్యక్తి ఎడమ మోకాలిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ పలు ఆసుపత్రులను ఆశ్రయించినా తగ్గకపోవడంతో జిల్లా ఆసుపత్రికి రాగా, వైద్యులు మోకాలిలోని చీమును తొలగించి, అనంతరం కుడి తొడ నుంచి చర్మాన్ని సేకరించి ఎడమ మోకాలికి చర్మ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అశోక్ రెడ్డి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మొయినుద్దీన్, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్, జనరల్ సర్జన్లు డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రాము, అనస్థీషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామం తదితరులతో పాటు నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది భాగస్వామ్యం ఉందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు ఈ అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఖరీదైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా ఆసుపత్రిలోనే నాణ్యమైన సేవలను పొందాలని కోరారు.

శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగొద్దు...

మెట్‌పల్లిలో వినాయక నవరాత్రోత్సవాలపై సమన్వయ సమావేశం పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

వినాయక చవితి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నవరాత్రులను పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నివారణ చర్యలపై అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సదస్సులో మెట్‌పల్లి డీఎస్పీ ఎ. రాములు, మున్సిపల్ చైర్మన్ మైలారపు



లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, ఆర్డీవో, సీఐ, ఎస్ఐ, తహసీల్దార్లతో పాటు మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వరు..
కరెంటు ఉన్నా ఇవ్వరు

రైతు సమస్యలపై ప్రభుత్వం కళ్లు తెరవాలి: మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ప్రభాతవార్త: రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం రేచపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు భీమ్‌రెడ్డిగూడెం మాజీ సర్పంచ్ బుచ్చి మల్లయ్యను పరామర్శించారు. రేచపల్లిలో మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించారు.కాల్వ నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వరు.. కరెంటు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వర్థు అని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం 12 గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

రబీ సీజన్‌లో రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల ని కోరారు. ఎరువుల కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికా దన్నారు. యూరియా పంపిణీ విధానాన్ని సరళీకరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ నివేదిక అంశాలను ప్రస్తావిస్తూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పెద్దగా దెబ్బతినలేదని, మేడిగడ్డలోని ఒక బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లకే సమస్య వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని, సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించడంలో విఫలమైతే క్రాప్ హాలిడే ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తెలు రాజు, సర్పంచులు ఆకుల రమేష్, భూక్య భారతి చిరంజీవి, ప్రమీలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ స్టేజ్02 పనులు ప్రారంభం..

మూడు యూనిట్లు.. 2,400 మెగావాట్లు..

తొలి అడుగుప్రధాన ప్లాంట్ స్థల చదును పనులకు శ్రీకారం

ఎన్టీపీసీ, ప్రభాతవార్త:రామగుండం: తెలంగాణ దశ-రెండు విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ఘట్టానికి తెరలేచింది. మూడు యూనిట్లలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థంతో మొత్తం 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ప్రధాన ప్లాంట్ స్థల చదును పనులను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు.ప్రాజెక్టుకు సంబంధించిన బాయిలర్, టర్బైన్, జనరేటర్ తదితర ప్రధాన పరికరాల నిర్మాణ ప్యాకేజీని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ సంస్థకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో స్థల చదును పనులు ప్రారంభం కావడం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.స్థల చదును పూజా కార్యక్రమం జాతీయ తాప విద్యుత్ సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు సి.కె. సమంత సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ తాప విద్యుత్ సంస్థ, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.స్థల చదును పనులు ప్రారంభం కావడంతో తెలంగాణ దశ-రెండు ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకోనున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా 2,400 మెగావాట్ల సామర్థంతో చేపడుతున్న తెలంగాణ దశ-రెండు ప్రాజెక్టు పనుల్లో స్థల చదును ప్రారంభం కీలక ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు.



ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలి

: గ్రామసభలో అధికారుల సూచన

ఏపీ లింగోటంలో సర్ రెండో దశ నోటీసులపై గ్రామసభ

నార్కట్‌పల్లి ప్రభాతవార్త సెప్టెంబర్ 12 మండలంలోని ఏపీ లింగోటం సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) రెండో దశ నోటీసుల హియరింగ్ కార్యక్రమంలో భాగంగా ఏపీ లింగోటం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఓటరు జాబితా, ఓటర్ల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అభ్యంతరాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి, ఏవైనా తప్పులు



ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. గ్రామ సభలో మండల గిర్దవార్ బి. యాదయ్య, గ్రామ పాలన అధికారి శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి జయ సుధ, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు గడ్డం రాష్ట్రపతి, గ్రామ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు నాగరాజు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం పశుపతి, వార్డు మెంబర్ మేడమైన్ కళ్యాణ్, తండా సైదులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

సెప్టెంబర్ 17 విమోచనం కాదు...

తెలంగాణ ప్రజలకు జరిగింది ముమ్మాటికీ విద్రోహమే

కట్టంగూర్,, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు జరిగింది విమోచనమో, విలీనమో కాదని, ప్రజలకు జరిగింది ముమ్మాటికీ విద్రోహమేనని సీపీఐ (యంయల్) న్యూడెమోక్రసీ నల్లగొండ జిల్లా కార్యదర్శి సాగర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17ను జిల్లా వ్యాప్తంగా చీకటి రోజు (విద్రోహ దినం)గా పాటించాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని ఈదులూరు గ్రామం లోని కామ్రేడ్ బూరుగు అంజయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఒకవైపు నిజాం, రజాకార్ల అరాచకాలు.. మరోవైపు దొరలు, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వం లో తెలంగాణ ప్రజలు భూమి, భుక్తి, విముక్తి కోసం చారిత్రక సాయుధ పోరాటం నిర్మించారని గుర్తుచేశారు. ఆపరేషన్ పోలోఖి పేరుతో ప్రవేశించిన భారత సైన్యం కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో పెద్ద సంఖ్యలో



రైతులను, సామాన్య ప్రజలను పొట్టనబెట్టుకుందని, అలాంటి దమనకాండ జరిగిన రోజు విమోచన ఎలా అవుతుందని ప్రశ్నించారు. బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం ఈ పోరాటాన్ని హిందూముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తోందని ధ్వజమెత్తారు. పాలకుల రాజకీయ ప్రచారానికి అమరవీరుల త్యాగాలను బలి చేయవద్దని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి అంబటి చిరంజీవి, నాయకులు గజ్జి రవి, రావుల లింగయ్య, వేముల శంకర్, బూరుగు సత్తయ్య, సిలువేరు జానయ్య, బొంగరాల నర్సింహా, శ్రీను, చంద్రయ్య, అంజయ్య, మల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత ఆర్యవైశ్య కుటుంబాలకు వాసవి క్లబ్ చేయూత

నార్కట్‌పల్లి ప్రభాతవార్త, సెప్టెంబర్ 12



చెరువుగట్టులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మడిగెలు కాలిపోయి నష్టపోయిన ఆర్యవైశ్య కుటుంబాలకు వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ నల్లగొండ డిస్ట్రిక్ట్ 104ఏ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. శనివారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో బాధితులు శ్రీ రంగా శ్రవణ్ కుమార్, శ్రీమతి కర్నాటి రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.6,000 చొప్పున, మొత్తం రూ.12,000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గజవెల్లి యాదయ్య సహకారంతో కార్యక్రమానికి హాజరైన వారికి బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ అధ్యక్షులు వీన్ సింగిరికొండ గోవర్ధన్, కోశాధికారి వీన్ . గజవెల్లి యాదయ్య, క్లబ్ గౌరవ అధ్యక్షులు వీన్ . కేసీజీఫ్ గజవెల్లి సత్తయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే శ్రీ అన్నపూర్ణ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్టు చెరువుగట్టు అధ్యక్షులు రంగా సీతయ్య, సభ్యులు రంగా వెంకటేశ్వర్లు, ఇరుకుల్ల సంపత్, చెరువుగట్టు దేవాలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ఆపన్నహస్తం అందించిన వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ నల్లగొండ సభ్యులకు, కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ - నల్లగొండ సభ్యులు: సింగిరికొండ గోవర్ధన్ కార్యదర్శి: మురారి శెట్టి కృష్ణ య్యకోశాధికారి: గజవెల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎనమల్ల నవీన్ ఏకగ్రీవ ఎన్నిక

డిండి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎనమల్ల నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదగిరిగుట్ట లో మొదటి రోజు బహిరంగ సభ, అనంతరం రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రతినిధుల మహాసభలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా తన ఎన్నికపై ఎనమల్ల నవీన్ స్పందిస్తూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏఐవైఎఫ్ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యాచరణ అమల్లో ముందు వరుస: కేంద్ర, రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చే ప్రతి పోరాట కార్యాచరణను తూచా తప్పక పాటిస్తానని స్పష్టం చేశారు.



ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పుణ్యమూర్తి శివ త్రిశూల్‌కు డాక్టరేట్

డిండి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాస్ కమ్యూ నికేషన్ అండ్ జర్నలిజం విభాగం నుంచి పుణ్యమూర్తి శివ త్రిశూల్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ స్టీవెన్సన్ పర్య వేక్షణలో బాడీ యాజ్ మీడియం క్రిటికల్ స్టడీ ఆఫ్ టాటూ కల్చర్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ లభించింది. సికింద్రాబాద్ సైనిక్‌పురిలోని భవన్ వివేకానంద కాలేజీలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శివ త్రిశూల్ తండ్రి టీజీఎస్ఆర్టీసి సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించిన పుణ్యమూర్తి శివ త్రిశూల్‌ను కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, తోటి పరిశోధక విద్యార్థులు అభినందించారు.



అమావాస్య..చివరి శ్రావణ శుక్రవారం.. చెరువుగట్టులో భక్తుల సందడి



నార్కట్‌పల్లి ప్రభాతవార్త సెప్టెంబర్ 12 చెరువుగట్టు అమావాస్యతో పాటు చివరి శ్రావణమాస శుక్రవారం కావడంతో చెరువుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.ఈ సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష పుష్పార్చనను దర్శించుకున్న భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచి, తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. అమావాస్య, శ్రావణమాస చివరి శుక్రవారం కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో చెరువుగట్టు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో నిలబడి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు ఉపాధ్యాయ, జర్నలిస్టుల దినోత్సవ వేడుకలు

నకిరేకల్, ప్రభాతవార్త, సెప్టెంబరు 12,

లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్, లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ నవ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, జర్నలిస్టుల దినోత్సవ వేడుకలను ఈనెల 13న ఆదివారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు లయన్ సూర్యచంద్రరావు, లయన్ డి. పద్మజ తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం, సెప్టెంబరు 6న నిర్వహించే జర్నలిస్టుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. నకిరేకల్ మండలం తాటికల్‌లోని వృద్ధాశ్రమంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, పి.ఎం.జె.ఎఫ్. లయన్ డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. క్లబ్‌లోని గౌరవ ఉపాధ్యాయ సభ్యులను సత్కరించి, వారి సేవలను గౌరవించుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందు సభ్యులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్, లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ నవ్య సభ్యులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని వారు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ఫిన్లాండ్ విద్యా పర్యటనకు రెడ్డిపల్లి సైదులు ఎంపిక

కట్టంగూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త,

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీచర్స్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ - ఫిన్లాండ్ (బ్యాచ్-2)కు కట్టంగూరు మండల కేంద్రానికి చెందిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఆలేరు పాఠశాలకు చెందిన రెడ్డిపల్లి సైదులు (స్కూల్ అసిస్టెంట్) ఎంపికయ్యారు. పాఠశాల విద్యలో అంతర్జాతీయ స్థాయి ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడం, ఉపాధ్యాయుల వృత్తిపరమైన సామర్థ్యాలను మరింత పెంపొందించడం, ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న ఆధునిక విద్యా పద్ధతులను తెలుసు కోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. ఫిన్లాండ్‌తో పాటు సింగపూర్, వియత్నాం, జపాన్ దేశాల్లో విద్యా విధానాలను పరిశీలించేలా ఈ ఎక్స్‌పోజర్ విజిట్‌ను రూపొందించారు. ఫిన్లాండ్ బ్యాచ్-2 పర్యటనకు ఎంపికైన 33 మంది ప్రధానో పాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల జాబితాలో ఆర్. సైదులు చోటు దక్కించుకున్నారు. పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహించ నున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు పర్యటనలో భాగంగా ఫిన్లాండ్‌లోని విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన పొంద నున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు సంబంధిత ఉపాధ్యాయులు అవసరమైన యన్.ఓ.సి.ను సంబంధిత అధికారుల నుంచి పొందాలని విద్యాశాఖ ఆదేశించింది. ఆర్.సైదులు ఫిన్లాండ్ విద్యా పర్యటనకు ఎంపిక కావడం పట్ల కట్టంగూరు మండల కేంద్రానికి చెందిన ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

భక్తిలోనూ ప్రకృతి పరిరక్షణే లక్ష్యం

పర్యావరణ పరిరక్షణలో పద్మశాలి సేవా సంఘం ఆదర్శం

15 ఏళ్లుగా మట్టి గణపతి ప్రతిష్ఠ.. సమాజానికి చైతన్య సందేశం

గొల్లపల్లి, ప్రభాతవార్త: దైవాన్ని పూజించడంలోనూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం సభ్యులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూనే పర్యావరణహిత విధానాలను పాటిస్తూ సమాజానికి చైతన్య సందేశాన్ని అందిస్తున్నారు.భక్తి అంటే ప్రకృతిని కాపాడటమే..పద్మశాలి సంఘ భవనంలో గత 15 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాన్నే ప్రతిష్ఠిస్తూ పర్యావరణహిత వినాయక చవితిని నిర్వహిస్తున్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు దూరంగా ఉంటూ సుమారు మూడు అడుగుల సహజ మట్టితో తయారు చేసిన గణపతిని పూజిస్తూ భక్తి అంటే దైవాన్ని ఆరాధించడం ఎంత ముఖ్యమో.. దైవ సృష్టిగా భావించే ప్రకృతిని కాపాడటం కూడా అంతే ముఖ్యమనే సందేశాన్ని తమ ఆచరణ ద్వారా చాటుతున్నారు.మారుతున్న కాలంలో ప్రతి ఏడాది భారీ, రంగురంగుల విగ్రహాల వైపు ప్రజలు ఆకర్షితులవుతున్న సమయంలో.. మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తూ పద్మశాలి సేవా సంఘం సభ్యులు పర్యావరణహిత మార్గాన్ని ఎంచుకోవడం ప్రత్యేకంగా



నిలుస్తోంది. మట్టి విగ్రహాల వినియోగంతో నిమజ్జనం అనంతరం నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించవచ్చనే అవగాహనను ప్రజల్లో కల్పిస్తున్నారు.

ఆచరణతోనే అవగాహన..

పర్యావరణ పరిరక్షణపై కేవలం ఉపన్యాసాలు ఇవ్వడం కాకుండా.. 15 ఏళ్లుగా మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తూ ఆచరణలో చూపిస్తున్న పద్మశాలి సేవా సంఘం సభ్యులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పండుగల్లో భక్తి, సంప్రదాయం, సంస్కృతితో పాటు పర్యావరణ బాధ్యతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనను బలపరుస్తున్నారు.

మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశంతో పద్మశాలి సేవా సంఘం కొనసాగిస్తున్న ఈ పర్యావరణహిత సంప్రదాయం మండల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోంది. భక్తి ఉత్సవాలు ప్రకృతికి భారంగా కాకుండా.. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించే వేడుకలుగా మారాలనే చైతన్యాన్ని తెలియచేపుతున్నారు.

వరుసగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

సరఫరా నిలిచి ఆందోళన చెందుతున్న రైతులు

మల్యాల, ప్రభాతవార్త; మల్యాల బీసీ హాస్టల్ సమీపంలో గల డంప్ యార్డ్ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను గుర్తుతెలియని శుక్రవారం రాత్రి వ్యక్తులు బద్దలు కొట్టి అందులోని విలువైన కాపర్ వైర్ చోరీకి పాల్పడ్డారు, ఈ ప్రాంతంలో వెళ్లే రైతులకు శనివారం ఉదయం ఈ విషయం వెలుగులోకి రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు, వరుసగా రెండవసారి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల కాపర్ వైర్ చోరీకి పాల్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, మల్యాల లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ దొంగలించడం ఇది రెండవసారి, దుండగులు జన సంచారం లేని మారుమూల ప్రాంతంలో ఉండే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లపై కన్ను వేసి, రాత్రివేళ విద్యుత్ సరఫరా లేని సమయంలో పథకం ప్రకారం ఈ చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసింది,



సిరిసిల్ల కోర్టులో ఘనంగా జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా మార్చుకుని ఆర్థికంగా, మానసికంగా నష్టపోవద్దని, పరస్పర అవగాహనతో రాజీ పడటమే ఉత్తమ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ అదాలత్ ద్వారా రాజీపడదగ్గ పెండింగ్, ప్రీలిటిగేషన్ కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. భార్యాభర్తలు విభేదాలు వీడి కలిసి ఉండాలని, అన్నదమ్ములు భూములు, ఆస్తుల తగాదాలు పక్కనపెట్టి కుటుంబ ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి.లక్ష్మణాచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవునూరి రమాకాంతరావు, డీఎస్పీ నాగేంద్రచారి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త : మధ్యమానేరు కుడి కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పరిసర గ్రామాల రైతులు శనివారం వంతడుపుల గ్రామ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు.కాలువలో నీరు అందక పరిపైర్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో రాస్తారోకోకు దిగాల్సి వచ్చిందన్నారు.గతంలోఇదే సమస్యపై రైతులు రాస్తారోకోలు,ధర్నాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు.మధ్యమానేరు కుడి కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.సాగునీరు అందక పంటలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు.





మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం..

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త : తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వినూత్నంగా ఆలోచించారు. స్వయంగా మట్టి గణపతి ప్రతిమలను తయారు చేసి మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో ప్రదర్శించి, ప్రజలకు పంపిణీ చేశారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల విగ్రహాల వల్ల చెరువులు,నీటి వనరులు కలుషితమై మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని,మట్టి గణపతుల వల్ల పర్యావరణం పరిరక్షించబడుతుందని వక్తలు సూచించారు.మట్టి గణపతినే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర లక్ష్మీరాజం,పద్మశాలి సంఘం అధ్యక్షులు రాపెల్లి ఆనందం, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మచ్చ శ్రీనివాస్, సామల రమేష్,అంకారపు మహేష్,బీముని అశోక్, సుద్దాల కర్ణాకర్, జూకంటి శంకర్,బాలు,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త : లయన్స్ క్లబ్ ఆఫ్ సిరిసిల్ల ఆధ్వర్యంలో పి డి జి లయన్ అనంతుల శివప్రసాద్ మట్టి వినాయకులు తయారు చేసిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు .పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు . దాదాపు 100 మంది విద్యార్థులు ఇట్టి మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని చాలా చక్కగా విగ్రహాలను తయారు చేయడం జరిగింది.విగ్రహ తయారీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తరగతుల వారిగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.అందరికీ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సిరిసిల్ల ప్రతినిధులు లయన్ చేపూరి శ్రీనివాస్, లయన్ పబ్బ నాగరాజు, లయన్ మడుపు నవీన్ రెడ్డి, లయన్ కొత్తపల్లి శ్రీధర్, లయన్ నంగునూరి శ్రీకాంత్, లయన్ బచ్చు భాను చందర్, తక్షశిల స్కూల్ కరస్పాండెంట్ మడుపు శ్రీకాంత్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిరిసిల్ల వార్త





మోదీ సేవా ప్రస్థానం కార్యకర్తలకు స్ఫూర్తి

భాజపా జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి ప్రధాని వరకు 25 ఏళ్లుగా సాగుతున్న నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని భాజపా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మోదీ ప్రజాసేవలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఖిసేవా సంకల్ప్ అభియాన్ఖి సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కార్యకర్తలు క్షేత్రస్థాయి సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమయం కేటాయించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సిరికొండ శ్రీనివాస్, ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, దశరథం రెడ్డి పాల్గొన్నారు.




నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు జరపాలి: సీఐ

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలకు ఇబ్బంది కలగకుండా, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిరిసిల్ల పట్టణ సీఐ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని గాజుల మల్లయ్య ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ, శాంతి కమిటీ సభ్యులతో పోలీసులు శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రహదారులపై రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్, పోలీసు శాఖల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సై గణేశ్, విద్యుత్ శాఖ ఏడీఈ, తదితర అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో కళాశాల విక్రయం

పోలీసులను ఆశ్రయించిన నిర్వాహకుడు దిడ్డి శ్రీనివాస్

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: ఫోర్జరీ సంతకాలతో శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలను ఇతరులకు విక్రయించారంటూ కళాశాల నిర్వాహకుడు దిడ్డి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత నిర్వాహకుడి కథనం ప్రకారం.. 2004లో రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మశ్రీ జూనియర్ కళాశాలను కొనుగోలు చేసి, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలగా మార్చి నిర్వహిస్తున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, సభ్యురాలిగా ఆయన భార్య రమ ఉన్నారు. కళాశాల లావాదేవీలపై ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల జగన్‌గౌడ్‌ను లెక్కలు అడగ్గా సమాధానం దాటవేస్తూ వచ్చారు. అనుమానంతో ఆరా తీయగా.. తమ ప్రమేయం లేకుండా 2023 డిసెంబరు 1న సమావేశం నిర్వహించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి, సంతకాలు ఫోర్జరీ చేసి కళాశాలను ఇతరులకు విక్రయించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిరిసిల్ల టౌన్ పోలీసులు క్రైమ్ నంబర్ 298/2026తో పలు బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రవీందర్ మృతి బీసీ ఉద్యమానికి తీరని లోటు జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



చిగురుమామిడి, ప్రభాత వార్త : చివరి శ్వాస వదిలే వరకు బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి గీకురు రవీందర్ అని, అలాంటి ఉద్యమ మరణం బీసీ ఉద్యమాలకు తీరనిలోటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు శనివారం చిగురుమామిడి మండలం కేంద్రంలో గీకురు రవీందర్ సంతాప సభకు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి గీకురు రవీందర్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం తన కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందుతుందని, కానీ సమాజం అంతా అభివృద్ధి చెందాలంటే ప్రజాసేవే మార్గమని భావించి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి సమాజ సేవ చేయడానికి సింగిల్ విండో డైరెక్టర్ గా, రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్ గా, చిగురుమామిడి మండలం జడ్పీటీసీగా పనిచేశాడని, ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేసి తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత బీసీ ఉద్యమంలో మమేకమై అత్యంత క్రియాశీలకంగా గీకురు రవీందర్ పనిచేశారని, హుస్నాబాద్ గడ్డపై బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ గెలుపు కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగుల కనుకయ్య గౌడ్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, యువజన సంఘం అధ్యక్షుడు మాదాసు సంజీవ్, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, పీఏసీ చైర్మన్ చిటుమల్ల శ్రీనివాస్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన సంఘము రాష్ట్ర కార్యదర్శి గందే రమేష్, మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి చెల్పూరు విష్ణుమాచారి, గ్రామశాఖ అధ్యక్షులు సిరవేణి సంపత్, ముద్రవేణి కుమార్ పాల్గొన్నారు.

జగిత్యాల వార్త



మాజీ మంత్రి రాజేశం గౌడ్ పరామర్శించిన మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి,తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిసెల రాజేశం గౌడ్‌ను మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య,నేరెళ్ల ఆంజనేయులు, జగిత్యాల ప్రముఖ వ్యాపారవేత్త గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆత్మీయంగా కలిసి పరామర్శించారు. గతంలో ఎడమ కాలికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రాజేశం గౌడ్, తాజాగా కుడి కాలికి కూడా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు,ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్‌తో ఆత్మీయంగా మాట్లాడి, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

మూడు క్లిష్టమైన కేసులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా అందుబాటులో అధునాతన వైద్య సేవలు.... జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్



పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో మూడు క్లిష్టమైన కేసులకు విజయవంతమైన శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ స్పష్టం చేశారు. మంథని మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన 75 సంవత్సరాల వ్యక్తి ఎడమ మోకాలిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ పలు ఆసుపత్రులను ఆశ్రయించినా తగ్గకపోవడంతో జిల్లా ఆసుపత్రికి రాగా, వైద్యులు మోకాలిలోని చీమును తొలగించి, అనంతరం కుడి తొడ నుంచి చర్మాన్ని సేకరించి ఎడమ మోకాలికి చర్మ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అశోక్ రెడ్డి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మొయినుద్దీన్, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్, జనరల్ సర్జన్లు డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రాము, అనస్థీషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామం తదితరులతో పాటు నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది భాగస్వామ్యం ఉందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు ఈ అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఖరీదైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా ఆసుపత్రిలోనే నాణ్యమైన సేవలను పొందాలని కోరారు.



నీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వరు..

కరెంటు ఉన్నా ఇవ్వరు

రైతు సమస్యలపై ప్రభుత్వం కళ్లు తెరవాలి: మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ప్రభాతవార్త: రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం రేచపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు భీమ్‌రెడ్డిగూడెం మాజీ సర్పంచ్ బుచ్చి మల్లయ్యను పరామర్శించారు. రేచపల్లిలో మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించారు.కాల్వ నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వరు.. కరెంటు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వర్ధ అని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం 12 గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

రబీ సీజన్‌లో రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల ని కోరారు. ఎరువుల కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికా దన్నారు. యూరియా పంపిణీ విధానాన్ని సరళీకరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ నివేదిక అంశాలను ప్రస్తావిస్తూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పెద్దగా దెబ్బతినలేదని, మేడిగడ్డలోని ఒక బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లకే సమస్య వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని, సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించడంలో విఫలమైతే క్రాప్ హాలిడే ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తెలు రాజు, సర్పంచులు ఆకుల రమేష్, భూక్య భారతి చిరంజీవి, ప్రమీలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పండుగలు దొంగలకు పండుగ

వినాయక నవరాత్రుల్లో అప్రమత్తతే ముఖ్యం

రాత్రిళ్ళు ఇండ్లలో గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు ఎంతో ముఖ్యం

అప్రమత్తతతోనే దొంగతనాలు అరికట్టవచ్చు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త :గణేష్ నవ రాత్రి, ఇతర పండుగలలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉండడంతో అప్రమత్తతోనే వాటిని అరికట్టే అవకాశాలు ఎంతగానో ఉంటాయి గణేష్ చతుర్థి పండుగ సందర్భంగా పిక్‌పాకెటర్లు , జేబు దొంగలు మరియు ఇతర ఆస్తి నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలి. రద్దీ ప్రాంతాలను ఆసరాగా చేసుకుని మొబైల్ ఫోన్లు, పర్సుల, ఇతర విలువైన వస్తువులను దొంగిలించే అవకాశం ఎంతగానో ఉంటాయి పూజా సామగ్రి మరియు ఇతర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో మొబైల్ ఫోన్‌ను షర్ట్ జేబులో పెట్టుకోకండి.మొబైల్ ఫోన్, పర్సు మరియు ఇతర విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచండి. రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండండి. మొబైల్ దొంగతనం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. దొంగిలించిన మొబైల్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు జరగకుండా వెంటనే సంబంధిత బ్యాంక్ ఖాతాలు, యూపీఐ సేవలను భద్రపరచండి. మీ మొబైల్‌లో స్క్రీన్ లాక్ మరియు ఇతర భద్రతా ఫీచర్లను తప్పనిసరిగా ఉపయోగించండి. లేడీస్ పూజలకు పోయి వచ్చే సమయంలో మీ యొక్క బంగారు ఆభరణాలు జాగ్రత్త, ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే లాకర్స్ భద్రపరుచుకోవలసి ఉంటది. వినాయక చవితి ఇతర పండుగల నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి , జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనం అరికట్టవచ్చు.





మట్టి వినాయకులతో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: వినాయక పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం కరీంనగర్ కార్పొరేషన్ 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ కార్యాలయంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్ డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కార్పొరేటర్ గుమ్మడి రాజ్ కుమార్ చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాన్ని అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతి ఏటా ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం తమ ప్రధాన కార్యక్రమమని కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి. టౌన్ సిఐ కరుణాకర్.



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: గణేష్ మండప నిర్వాహకులు రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రజా జీవనానికి భంగం కలగకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. కరుణాకర్ మాట్లాడుతూ విద్యుత్ తీగలకు దగ్గరగా గణేష్ మంటపాలను నిర్మించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా మంట పాలను ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల్లో భక్తి పాటలు మాత్రమే వేయాలని సూచించారు. హిందూ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా యూత్ పేర్లు పెట్టుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచన మేరకు డిఎస్పి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో "ఈనెల 12వ తేదీ శనివారం దేవిశ్రీ గార్డెన్ లో గణేష్ మంటప నిర్వాహకులతో సమావేశం" ఉంటుందని ఈ సమావేశంలో మంట పాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొనాలని సిఐ కోరారు.

కరీంనగర్ - జగిత్యాల హైవేపై సీసీ కెమెరాల ఏర్పాటు

రహదారి భద్రత, నేరాల నియంత్రణకే ప్రాధాన్యం: నూతన వ్యవస్థను ప్రారంభించిన అదనపు డీసీపీ వెంకటరమణ రెడ్డి

కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త : ప్రజల రక్షణ, రహదారి ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుం దని అదనపు డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ రెడ్డి అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సూచనల మేరకు కొత్తపల్లి – జగిత్యాల ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, హైవేలపై 24 7 నిరంతర నిఘా, వాహనాల కదలికల పర్యవేక్షణ, ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ దర్యాప్తుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తా యని తెలిపారు. ఈ అత్యాధునిక కెమెరాల్లో హైరిజల్యూషన్ వీడియో రికార్డింగ్, రాత్రి వేళల్లో నిఘా, నంబర్ ప్లేట్ గుర్తింపు వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సామాజిక దృక్పథంతో ఈ వ్యవస్థ ఏర్పాటుకు సహకరించిన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డిని పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా భద్రతకు తోడ్పడే కార్యక్రమాలను ప్రోత్సహించడం



ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, కొత్తపల్లి సీఐ బి. కోటేశ్వరరావు, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.



అంకిత్ హాస్పిటల్స్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు : ఎండీ డా. అనురాధ

మానకొండూర్, ప్రభాతవార్త:

అంకిత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. కవ్వంపల్లి అనురాధ తెలిపారు. మానకొండూరు మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకున్న మహిళలకు శనివారం రిపోర్టులను అందజేసి, వైద్యపరమైన సూచనలను డాక్టర్ అనురాధ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డా. అనురాధ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాల పేరుతో రోగులను తమ ఆసుపత్రికి రప్పించుకోవాలనే ఉద్దేశం తమకు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి, అవసరమైన సమయంలో సరైన చికిత్స పొందేలా అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అయితే, ఉచిత వైద్య శిబిరాలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గత నెల 23న ఎం ఎన్ జే , అంకిత్ హాస్పిటల్స్ సయుక్తం గా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల్లో కొంతమందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, సొసైటీ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, గంగుల రామిరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్, మడుపు ప్రేమ్ కుమార్, కోండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం,కనకం అశోక్, ఎనగంటి శ్రీకాంత్, సూర్య, ముస్తఫా, గుడాల మహేందర్, బాకారపు సమ్మయ్య, బుర్ర శ్రీకాంత్,దూలం దేవేంద్ర, ఎర్రోళ్ల కవిత, తదితరులు పాల్గొన్నారు .

శాంతియుతంగా నవరాత్రులు జరుపుకోవాలి

గొల్లపల్లి, ప్రభాతవార్త : వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతా వరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వ హించుకోవాలని ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి సూచించారు. వినా యక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గొల్లపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉత్సవ మండపాల నిర్వాహకులతో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రావు, విద్యుత్ సబ్ ఇంజినీర్ ప్రవీణ్, ఎస్ఎల్ఐ వెంకట రమణ, వివిధ వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.





క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ డాక్టర్ : కవ్వంపల్లి


మానకొండూర్, ప్రభాతవార్త : మానకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో క్షయ వ్యాధి (టీబీ) రోగులకు పౌష్టికాహారం కిట్లను మాధవి సీడ్స్ యజమా నులు రేమిడి శ్రీనివాస్ సత్యవతి దంపతులు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ వారి అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కవ్వంపల్లి అనురాధ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆరోగ్య కేంద్రంలోని క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, సొసైటీ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, గంగుల రామిరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్, మడుపు ప్రేమ్‌కుమార్, సురేష్, రేవెల్లి రాజలింగం, కనకం అశోక్, గొల్లెన కొమురయ్య, బుర్ర శ్రీకాంత్, మండల బక్కారెడ్డి, ఎనగంటి శ్రీకాంత్, దూలం దేవేంద్ర, దూలం వీరస్వామి, ఎర్రోళ్ల కవిత, రాజేశం పాల్గొన్నారు.



వెల్దిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మానకొండూర్, ప్రభాతవార్త : మానకొండూరు మండల పరిధిలోని వెల్ది గ్రామపంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల పోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, ఉప సర్పంచ్ రుద్రవరం సాయికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలోని లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో అర్హులైన లబ్ధిదారు లకు ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ వార్డు సభ్యుడు బొబ్బిలి రాజశేఖర్, నాయకులు పినమల్ల కొమురయ్య, మాశం ఎల్లయ్య, గంప చంద్రమోళి, బత్తిని పరశురాములు, రేషన్ డీలర్లు నర్సింగం, శంకరయ్య, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త



సీజనల్ పండ్లు, కూరగాయలతో ఆరోగ్యం

కరీంనగర్ హెల్త్, ప్రభాతవార్త: రోజువారి ఆహారంలో సీజనల్ పండ్లు, తాజా కూరగాయలను చేర్చుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. ఐసిడిఎస్, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్కండేయ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, తద్వారా తల్లి బిడ్డలు పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, సూపర్వైజర్ వెంకటలక్ష్మీ, అంగన్వాడి టీచర్ శ్రీలత, రమణ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

కొత్తపల్లి సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త) నిరుపేద యాదవ కుటుంబానికి చెందిన కన్నవేని కనక లక్ష్మీ ఇటీవల తీవ్రమైన అనారోగ్యంతో మరణించగా ఆమె కుమారులు నరేష్ ,సురేష్ లను జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న యాదవ్ వారి నివాసంలో పరామర్శించి ఆరువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్య యాదవ్ ఉపాధ్యక్షులు పాశం తిరుపతి యాదవ్ మల్లేష్ యాదవ్ మల్లికార్జున యాదవ్ కాల్వ శ్రీను యాదవ్. మహేష్ చారి శ్రీను గౌడ్ తదితరులు పాల్గొన్నారు

లోక్ అదాలత్ లలో కేసుల సత్వర పరిష్కారాలు...

జిల్లా జడ్జి శివకుమార్...

కరీంనగర్ లీగల్, ప్రభాతవార్త: రాజీతో కేసులు సత్వరంగా పరిష్కరించు కోవాలనుకుంటే లోక్ అదాలతులే సరియైన మార్గమని కరీంనగర్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ శివకుమార్ తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణ లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయం,డబ్బు వృధా కాకుండా ఉంటుందని, ఇరు వర్గాల మధ్య మంచి వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. రాజీ ద్వారా వారి కేసులు తొలగించుకోవాలనుకుంటే సంబంధిత పోలీస్ అధికారులను కానీ న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జస్వంత్ సింగ్ లోక్ అదాలత్ ల గూర్చి, రాజి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం లోక్ అదాలత్ బాధ్యతలలో ప్రతిభ కనబర్చిన న్యాయ మూర్తులకు, పోలీస్ సిబ్బందికి జిల్లా జడ్జి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రం న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూ రెన్స్, బ్యాంకు, చిట్ ఫండ్ కంపెనీలా ప్రతినిధులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో ముళ్ల చెట్లతో మూసుకుపోయిన బాటను పునరుద్ధరించిన పాలకవర్గం

కమలాపూర్: ప్రభాత వార్త. కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో శివాలయం సమీపంలో చెరువు కట్ట వద్ద, వీధి మలుపులో రోడ్డు పక్కన ఉన్న పెరుమాళ్ల బావి చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వద్ద ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగి దారి పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, తరచూ చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై గ్రామస్తులు సర్పంచ్ బండి వనజ కళాధర్, పాలకవర్గం దృష్టికి తీసుకురావడంతో వారు వెంటనే స్పందించి మండల తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న తహసిల్దార్ శనివారం ఆర్ఐ సమ్మయ్యను స్థల పరిశీలనకు పంపించారు. ఆర్ఐ పరిశీలన అనంతరం ఆయన సమక్షంలో సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఫెన్సింగ్ తో పాటు దాని చుట్టూ అలుముకున్న ముళ్ల పొదలను పూర్తిగా తొలగించి బాటను వెడల్పు చేసి పునరుద్ధరించారు. అదేవిధంగా అదే ప్రధాన రహదారిపై అక్రమంగా నిర్మించిన ర్యాంప్ ను కూడా జేసీబీ సహాయంతో తొలగించి రోడ్డును వెడల్పు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కడైనా రోడ్లపైకి అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, వాటిని కూడా తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బ్యాగుల్లో సేకరించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ఉప సర్పంచ్ పాక మమత నాగరాజు, పిల్లల రాజు, బయగాని సుమంత్, పాక రాజు, నడ్డునూరి శివ,కన్నూరు శృతి వేణు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

కమలాపూర్: ప్రభాత వార్త.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట రామిరెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కమలాపూర్ మండలం శనిగరం కూడలిలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహాధర్నా నిర్వహించారు.ఇటీవల అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చేసిన హంగామాను, కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు దళితులు వచ్చారని పసుపు నీటితో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ ఈ ధర్నా చేపట్టారు. నిరసనకారులు కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి రోడ్డుపై బైఠాయించి వాహనాలను నిలిపివేశారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడి సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ చూస్తోందని, జరిగిన ఘటనలపై బేషరతుగా క్షమాపణ చెప్పకుండా సమర్థించుకోవడం అహంకారానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ సైతం సీఎం రేవంత్ రెడ్డిని అనుచిత భాషతో దూషిస్తున్నారని, ఈ ఘటనలకు కేసీఆర్ పూర్తి బాధ్యత వహించి అసెంబ్లీకి వచ్చి తెలంగాణ దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఇంచార్జీలు పాడి కల్పన, రాజేశ్వరరావు, డీసీసీ కార్యదర్శి మాట్ల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మోటం కుమారస్వామి, మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, ఉప సర్పంచ్ భరత్, సర్పంచ్ అశోక్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి
స్ఫూర్తితో ఉద్యమిస్తాం..

సిపిఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త; కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమిస్తామని సిపిఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్ అన్నారు.శనివారం రోజున స్థానిక మండల పార్టీ కార్యాలయంలో జమ్మికుంట కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రతిసారి ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించి, గొంతెత్తిన మార్గదర్శి ఏచూరి అన్నారు. కార్మికులు, కర్షకులు, శ్రామికుల పేదలు అణగారి నవర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఎర్రజెండా ముద్దుబిడ్డ అని కొనియాడారు. విద్యార్థి దశ నుండే ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ పదునైన వాదనలు చేసేవారన్నారు. మార్క్సిజాన్ని కేవలం అధ్యయనం చేయడమే కాకుండా ఆ సిద్ధాంతాన్ని ప్రజా జీవితంలో ఆచరణకు తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు ఏచూరి అన్నారు. దేశంలోనే ఖ్యాతిగాంచిన జేఎన్యూలో విద్యనభ్యసించడంతోపాటు యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి రెండు దఫాలుగా అధ్యక్షుడిగా ఎన్నికై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులుగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రతి పౌరుడిని కలుపుకొని వెళ్లే వ్యవస్థ కావాలని, వ్యక్తి ఏ మతానికి చెందిన వాడైనా, ఏ భాష మాట్లాడిన ఏ ప్రాంతానికి చెందిన వాడైనా, స్త్రీ అయినా పురుషుడైన అందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన పదేపదే స్పష్టం చేసే వారన్నారు. సాంప్రదాయక రాజకీయ విభేదాలను దాటి ఆయన ఇండియా ప్రతిపక్ష కూటమి నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం,గేర రాజకుమారి,ఎస్ మధునయ్య,పి కర్ణాకర్, బి సుమంత్, ఎన్ సుభాష్, కే సురేష్, జె కుమార్, ఎం కిరణ్ పాల్గొన్నారు.





కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త; పెయింటింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అన్నారు.జమ్మికుంట పట్టణ పెయింటర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించుకుని ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు చొల్లెటి శ్యామ్, ఉపాధ్యక్షులు పొడేటి మొగిలి గౌరవ అధ్యక్షులు జక్కే రవీందర్ తో పాటు ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో పెయింటింగ్, పుట్టి, సీలింగ్ తదితర నిర్మాణ రంగాలకు సంబంధించిన పనులు చేసే కార్మికులు,పెయింటర్లకు నూతన కమిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జక్కే ప్రభాకర్,చరణ్,నర్సయ్య యాదగిరి,జమీర్,జానీ తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని కొత్తపల్లి గరుడ యూత్ వారిచే ఏర్పాటు చేయనున్న విఘ్నేశ్వరుని ఆగమన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలో ఏర్పాటు చేయనున్న విఘ్నేశ్వరుని భక్తి శ్రద్ధలతో గణనాథుని నవరాత్రులు పూజించుకోవాలని అంతే భక్తి శ్రద్ధలతో నిమర్జనం పూర్తయ్యేలా చూడాలని తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చిన మున్సిపల్ చైర్మన్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త; ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్(దిలీప్) ఇచ్చిన మాటకు కట్టుబడి హామీని నెరవేర్చారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని 24వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తన చెల్లెలు మొలుగు ప్రణీత గెలిచిన తర్వాత విగ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకొనుటకు మండపం నిర్మించాలని వార్డు ప్రజలు కోరగా తప్పకుండా రానున్న విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలకు మండపం నిర్మాణం చేయిస్తామని నాడు మాట ఇచ్చి నేడు ఇచ్చిన మాట ప్రకారం మండప నిర్మాణం చేయించి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట నిలబెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాము,అఖిల్,రాజేష్, సాగర్, రాజేష్, వీరస్వామి, పాపయ్య, నాని, తేజ, శ్రీరామ్, సురేష్, పొచాలు, పాల్గొన్నారు..

హుజూరాబాద్ వార్త



అయ్యప్ప జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు



జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త; అపర శబరిమలగా ప్రసిద్ధి చెందిన జమ్మికుంట అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్ర జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉత్తర నక్షత్ర అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ఆలయ అధ్యక్షులు సిరిమల్లె జయేందర్ గురుస్వామి, ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం లక్ష్మీ గణపతి హోమం, విశేషమైన ద్రవ్యములచే స్వామివారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి బచ్చు భాస్కర్ ప్రెస్సింగ్ అండ్ జిన్నింగ్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీ ధర్మశాస్త్ర కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని అయ్యప్ప స్వామినీ వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

గణేష్ ఆగమాన్‌లో పింగిలి.. పొనగంటి



జమ్మికుంట / హుజురాబాద్, ప్రభాతవార్త : కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కొత్తపల్లిలోని గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఆగమాన్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెడిసిసి బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మరియు సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ ఉత్సవాలు భక్తి, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. గరుడ యూత్ అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం గణేష్ ఆగమాన్ కార్యక్రమంలో యువతతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గరుడ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, భక్తులు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

కమలాపూర్: ప్రభాత వార్త. ప్రజలందరి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న "ఊరు కోసం ఒక రోజు" శ్రమదాన కార్యక్రమం 18వ వారంలో భాగంగా కమలాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శ్రమదానం చేపట్టారు. సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మార్క అశోక్, అవునూరి తిరుపతి, పిల్లి సతీష్, ఎండవెల్లి మల్లారెడ్డి, రాంశెట్టి రాజయ్య, తుమ్మ రాజేష్, గంధసిరి బిక్షపతి, పుల్ల ఐలయ్య, మోటం సంపత్, ఓస్కుల రత్నం, కనుకుంట్ల అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేల నిషేధాన్ని కచ్చితంగా పాటించాలి

గోదావరిఖని కోదండ రామాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేల నిషేధాన్ని కచ్చితంగా పాటించాలని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్చార్జి ఏసిపి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని, డీజే సౌండ్ వల్ల ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా గుండెపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉన్నందున సుప్రీంకోర్టు డీజే వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, కాబట్టి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎవరూ డీజేలను వినియోగించకూడదని తెలిపారు. గోదావరిఖని ప్రజలు ఎప్పుడూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తున్నారని, ఏ సంఘటన జరిగినా పోలీసులకు అండగా నిలుస్తూ, పోలీసులు సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ సహకరిస్తున్నారని, వివిధ జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి గోదావరిఖనిలో నివసిస్తున్న ప్రజలు ఇక్కడి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ అందరూ కలిసిమెలసి ప్రశాంతంగా జీవిస్తున్నారని, అందుకే గోదావరిఖని ఒక మినీ మాంచెస్టర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఆఫీసుద్దీన్, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్, ఎస్ ఐలు, ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులను అవమానించిన అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

రాష్ట్ర మాల సంఘ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు బొల్లి స్వామి



పెద్దపల్లి, ప్రభాతవార్త: దళితులను అవమానించిన బీఆర్ఎస్ నేతలపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి పార్టీని రద్దు చేయాలని రాష్ట్ర మాల సంఘ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల వాస్తవ్యులు బొల్లి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, రాష్ట్ర మాల సంఘ నాయకుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. దళితుల పట్ల అవమానకరంగా, అంటరానితనంతో కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద పసుపు నీళ్ల చల్లి శుద్ధిచేసి దళితులను అవమానించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీష్‌రావు దళితులను అవమానించేలా ఫామ్‌హౌస్ వద్ద దళితులు వెళ్లి దప్పు కొట్టినందుకు ఆ ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేసి దళితులను అవమానపరిచారని మండిపడ్డారు. అదేవిధంగా రాష్ట్ర అసెంబ్లీలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధుపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ, దళితులను అవమానించేలా మాట్లాడిన తాతా మధుతో పాటు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల అధికారులను కలవనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవుని సతీష్ మాదిగ రాష్ట్ర ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, గడియారం రత్నం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి, మహంకాళి రామచంద్రం, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు జున్ను జయరాజ్, గొర్రె రాజయ్య, దాసరి ఎల్లయ్య, ఇంజపూరి కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాల సంఘ నాయకులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ సేవలకు పూర్తి స్థాయి గౌరవం



ఓదెల,ప్రభాతవార్త: విద్యా రంగంలో 12 ఏళ్లుగా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా, చిత్రలేఖన ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న తమను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సన్మానించినందుకు మండల విద్యాధికారి వై రమేష్ కు అలాగే ప్రధానోపాధ్యాయులకు కల్వల సంజీవ్, క్యాతం లింగమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేయడం తమ సేవలకు లభించిన ప్రత్యేక గుర్తింపుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించి ప్రోత్సహించిన ఎంఈఓ వై. రమేష్, జడ్పీహెచ్ఎస్ ఓదెల ప్రధానోపాధ్యాయురాలు వెంగళ పద్మ, పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పోత్కపల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సికింద్రాబాద్, కాగజనగర్ మధ్య

జన్ సదరన్ ప్రత్యేక రైలు.....

అంతర్గాం,ప్రభాత వార్త : వినాయక చవితి సందర్భంగా ప్రయాణికుల రద్దీ ని దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ సికింద్రాబాద్, కాగజ్ నగర్ ల మధ్య 07235, 36 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైళ్ళ ను నడపనున్నట్లు స్థానిక రామగుండం రైల్వే అధికారులు తెలిపారు. చవితి పండుగ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 12,13,14 తేదీలలో ప్రయాణికుల సౌకర్యం కొరకు సికింద్రాబాద్, కాగజ్ నగర్ ల మధ్య రాకపోకలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు శని, ఆది, సోమవారాలలో ప్రత్యేక రైలు సికింద్రాబాద్ లో మధ్యాహ్నం 12గంటల 10 నిముషాలకు బయలుదేరి మధ్యాహ్నం 3 గంటల 50 నిమిషాలకు రామగుండం రైల్వే స్టేషన్ కు చేరుకొని కాగజ్ నగర్ వైపు వెళ్తుంది. మరలా అదే జన్ సధరన్ ప్రత్యేక రైలు 07236 పేరుతో సాయంత్రం 6గంటల కు కాగజ్ నగర్ లో బయలుదేరి రాత్రి 7 గంటల 10 నిముషాలకు రామగుండం రైల్వే స్టేషన్ చేరుకొని సికింద్రాబాద్ వెళ్తుందని రైల్వే అధికారులు తెలియజేశారు.

ఫారం పాండ్ పనులు ముమ్మరం



జూలపల్లి,ప్రభాతవార్త: జూలపల్లి మండలం తేలుకుంట గ్రామ పరిధిలో రైతులకు ఉపయోగకరంగా ఉండే ఫారం పాండ్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనుల్లో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ మట్టిని తొలగించి ఫారం పాండ్ నిర్మాణాన్ని వేగవంతంగా చేపడుతున్నారు.వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఫారం పాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.వర్షపు నీటిని ఒడిసి పట్టి నిల్వ చేయడం ద్వారా భవిష్యత్‌లో రైతులకు సాగునీటి అవసరాలకు కొంత మేర ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు గ్రామ సర్పంచ్ నాంపల్లి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పనులను గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్,ఉపసర్పంచ్ దావు సంపత్ రెడ్డి,చొప్పరి శేఖర్,ఉపాధి హామీ పథకం కూలీలు తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



జూలపల్లి,ప్రభాతవార్త: 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తేలుకుంట గ్రామ సర్పంచ్ నాంపల్లి సంపత్ కుమార్,ఉపసర్పంచ్ దావు సంపత్ రెడ్డి సూచించారు. అర్హత కలిగిన యువతీ,యువకులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన దని, 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పొందేందుకు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఓటరు నమోదుకు చివరి తేదీ: సెప్టెంబర్ 16, 2026 అని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెద్దపల్లి వార్త





బతుకమ్మ ఘాట్ పనులు ప్రారంభించిన సర్పంచ్

ఓదెల, ప్రభాతవార్త: ఓదెల మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ నిర్మాణం పనులకు శనివారం సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ భూమిపూజ చేశారు గ్రామ అభివృద్ధి పనుల్లో భాగంగా బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు బతుకమ్మ మెట్లు, ఘాట్ నిర్మించాలని పాలకవర్గం తీర్మానించింది ఇందులో భాగంగా సర్పంచ్ సతీష్, పాలకవర్గ సభ్యులు కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్, వార్డు సభ్యులు గొర్ల శ్రీనివాస్, దూలం సదానందం, రాపెల్లి రాజయ్య, చింతం విజయస్వామి, పెండం లక్ష్మీ ఓదెలు, కొండ్ర లక్ష్మణ్, తోట ఉమామహేశ్వరి, తీర్థాల శ్రీనివాస్, బుద్ధే కుమార్, రాచర్ల రమేష్, నూతి శంకర్, మాట్ల కుమార్, బోడకుంట శివన్న, బోడకుంట రామచంద్రం, చెరుకు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాల తయారీ శిక్షణ

పెద్దపల్లి, ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆ పాఠశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ తెలిపారు. వినాయక చవితి పర్వది నాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారుడు కూనరం గ్రామానికి చెందిన నారాయణ ఆధ్వర్యంలో చిన్నారులు ఎంతో ఆసక్తిగా మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేయడం నేర్చుకున్నారు. ఈ వర్షాకాలంలో చెరువు మట్టిని తీసుకొని వచ్చి దానితో గణపతిని చేసి వివిధ పత్రాలతో పూజించి మళ్లీ చెరువులో నిమజ్జనం చేయడం వలన చెరువు పూడిక తీసి మరియు శుభ్రపరచినట్లు అవుతుంది అనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్ మరియు గాయత్రి విద్యానికేతన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో ఇండియా, సీనియర్స్ కోకో సెలక్షన్ ట్రయల్స్ విజయవంతం

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జెడ్పీహెచ్ ఎస్ అప్పన్నపేట పాఠశాలలో నిర్వహించిన ఖోఖో ఇండియా సెలక్షన్ ట్రయల్స్, సీనియర్స్ సెలక్షన్స్ ట్రయల్స్ విజయవంతం అయినట్లు పెద్దపల్లి జిల్లా కోకో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. లక్ష్మణ్, డాక్టర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ జీ ఎఫ్ సెక్రటరీ కే. లక్ష్మణ్, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వేల్పుల సురేందర్, దాసరి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోకో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దాసరి ప్రసాద్, డాక్టర్ భూపెల్లి నారాయణ, ట్రెజరర్ ఇస్లావత్ నరేష్, కన్నూరి కోటేష్, జ్ఞాన విద్య ఉపాధ్యాయులు షఫీ పీఈటీ, మధుకర్ పీఈటీ, తిరుపతి, భాస్కర్, కిషోర్, అంజలి, శిరీష, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

మల్యాల సిఐ రాజ్ కుమార్

మల్యాల, ప్రభాతవార్త: మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకొని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మల్యాల సిఐ రాజ్ కుమార్ కోరారు, శనివారం మల్యాల ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో మండలంలోని గణేష్ మండప నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు, మండపాల వద్ద రెచ్చగొట్టే పాటలు, ఇబ్బంది కలిగించే విధంగా సౌండ్ సిస్టం, ప్రసంగాలు, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా, అనుమతులు లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొన్నారు, అనుమానస్పదా వ్యక్తులు కదలికలు ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై



వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు, ఉత్సవాల ప్రారంభం నుండి నిమజ్జనం వరకు మండవనిర్వాహకులు బాధ్యతలు వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, శాంతిభద్రతల నిర్వహణలో పోలీసులకు సహకరించాలని కోరారు,

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆరెపల్లి మానస్ కుమార్



పెద్దపల్లి, ప్రభాతవార్త: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి యువజన నాయకుడు ఆరెపల్లి మానస్ కుమార్ ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు ఈనెల 8 నుంచి 10 వరకు యాదగిరిగుట్టలో నిర్వహించగా, ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆరెపల్లి మానస్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆరెపల్లి మానస్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ఏర్పడిన తరువాత ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం లేకుండా యువజన సంఘంలో చేరి 2017లో జిల్లా కన్వీనర్‌గా, 2020లో జిల్లా అధ్యక్షుడిగా, 2022లో జిల్లా కార్యదర్శిగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పోరాట ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించానన్నారు. యాదగిరిగుట్టలో జరిగిన ఈ రాష్ట్ర మహాసభలలో తనపై నమ్మకం ఉంచి వివిధ జిల్లాల ప్రతినిధులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తన ఎన్నికకు సహకరించిన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేనా శంకర్, పెద్దపల్లి సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంకు, విద్యార్థి యువజన నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



తెలంగాణ స్టేజ్02 పనులు ప్రారంభం..

మూడు యూనిట్లు.. 2,400 మెగావాట్లు..

తొలి అడుగుప్రధాన ప్లాంట్ స్థల చదును పనులకు శ్రీకారం

ఎన్టీపీసీ, ప్రభాతవార్త:రామగుండం: తెలంగాణ దశ-రెండు విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ఘట్టానికి తెరలేచింది. మూడు యూనిట్లలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థంతో మొత్తం 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ప్రధాన ప్లాంట్ స్థల చదును పనులను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు.ప్రాజెక్టుకు సంబంధించిన బాయిలర్, టర్బైన్, జనరేటర్ తదితర ప్రధాన పరికరాల నిర్మాణ ప్యాకేజీని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ సంస్థకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో స్థల చదును పనులు ప్రారంభం కావడం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.స్థల చదును పూజా కార్యక్రమం జాతీయ తాప విద్యుత్ సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు సి.కె. సమంత సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ తాప విద్యుత్ సంస్థ, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.స్థల చదును పనులు ప్రారంభం కావడంతో తెలంగాణ దశ-రెండు ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకోనున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా 2,400 మెగావాట్ల సామర్థంతో చేపడుతున్న తెలంగాణ దశ-రెండు ప్రాజెక్టు పనుల్లో స్థల చదును ప్రారంభం కీలక ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు.



లోకా అదాలత్‌లో చెక్ బౌన్స్ కేస్ పరిష్కారం..

మెట్ పల్లి టౌన్. ప్రభాత వార్త: లోకా అదాలత్ లో 35 లక్షల చేక్ బౌన్స్ కేస్ శనివారం మెట్ పల్లి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జ్ వినుకొండ ఆధ్వర్యంలో 28 లక్షలకు పరిష్కారం జరిగింది. గత 2022వ సంవత్సరంలో విమల రాణి కి టి లక్ష్మణ్ 35 లక్షల చెక్కుని ఇవ్వగా బ్యాంకులో చెక్కు చెల్లకపోవడంతో ఆమె న్యాయవాది పడిగేల శ్రీనివాస్ ని సంప్రదించి చెక్ బౌన్స్ కేసు వేయడం జరిగింది. న్యాయవాది పడిగేలా శ్రీనివాస్ ఈ కేసుని 28 లక్షలకు రాజి చేయడం జరిగినది . ఈకార్య క్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, తోటి న్యాయవాదులు వడ్డేపల్లి శ్రీనివాస్ ఉజ్జల శ్రీనివాస్, వేణు, బాక్కురి రమేష్, రాంబాబు పాల్గొన్నారు.



వినాయక నవరాత్రుల కరపత్రం విడుదల

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక నవరాత్రుల రోజువారీ కార్యక్రమాల కరపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శి చాడ చంద్రకుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎలిమి రవికుమార్, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, వాసవి దేవాలయ అధ్యక్షులు చాడ సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలాధ్యక్షుడిగా వేణుగోపాలచారి నియామకం

మల్లాపూర్ ప్రభాతవార్త ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ఎస్.కె మజీద్, జాతీయ చైర్మన్ శిరిన్ ఆదేశానుసారం మండల అధ్యక్షుడిగా కొత్తదామరాజ్ పల్లి గ్రామానికి చెందిన ఇల్లెందుల వేణుగోపాల చారి శనివారం నియమితు లయ్యారు. ఈ మేరకు నూతనంగా నియామకమైన వేణుగోపాలచారికి జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమోళి నియామక ఉత్తర్వులను అందజేశారు. అదేవిధంగా మండల ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్ నియామకమ య్యారూ. తనపై నమ్మకం ఉంచి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా నియమించిన జాతీయ రాష్ట్ర జిల్లా నాయకులకు వేణుగోపాల చారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండి సేవలందిస్తారని వేణుగోపాల్ చారి తెలిపారు.



చొప్పదండి వార్త



మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మేయర్

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీరామోజు పూర్ణ చెందర్ అమ్మ ఇటీవలే అనారోగ్యం మరణించగా శనివారం కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగిలి సారయ్య, చేపూరి సత్యనారాయణ, దొంతిసారపు సంపత్, కట్నపల్లి ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తోట కోటేష్, మాజీ మండల అధ్యక్షులు కిట్టు గౌడ్, మండల నాయకులు గన్ను నర్సింహా రెడ్డి, ఏడ్ల సురేష్, పెద్ది వీరేశం, కుమార్, గాండ్ల సతీష్, పోలె మహేష్, తొంటి సతీష్, సాయిల్ల రవి, తొంటి అశోక్, గాండ్ల వేణు, పాలకూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



మట్టి గణపతులతో పర్యావరణం పరిరక్షిద్దాం

గంగాధర,ప్రభాతవార్త: వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణం కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని నరేంద్ర విద్యాలయం హై స్కూల్ యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్ రెడ్డి అన్నారు. పాఠశాలలో శనివారం విద్యార్థులు అత్యంత భక్తితో, ఉత్సాహంగా,మట్టి విగ్రహాలు తయారు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వివిధ రంగులతో రాశాయనా లను ఉపయోగించి విగ్రహాలు తయారు చేయడం వల్ల నిమజ్జనం సమ యంలో నీటి కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. మట్టి విగ్రహం ప్రతిష్ట చేసుకుంటే ఎలాంటి కాలుష్యం ఉండదన్నారు. విద్యార్థులు తమ తల్లితం డ్రులకు వివరించాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల టీచర్స్ పాల్గొన్నారు.



వెదిర గ్రామంలో నగర సంకీర్తన..

రామడుగు, ప్రభాతవార్త : రామడుగు మండలం లోని వెదిర గ్రామంలో శనివారం భక్తులు నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో గత 46 రోజులుగా నిర్వహిస్తున్న భాగవత ప్రవచనాలు కార్యక్రమంలో భాగంగా గ్రామ భక్త బృందం వారు నిత్యం నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రామములోని ప్రసాద వితరణ నిర్వహించే భక్తుని ఇంటికి వెళ్లి భజన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటుగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యమైన భవిష్యత్తు



మల్లాపూర్ ప్రభాతవార్త మండలం లోని వాళ్గొండ అంగన్వాడి కేంద్రాల లో పోషణ అభియాన్ పోషణ మాసం కార్యక్రమాన్ని శనివా రం చేపట్టారు. కాగా ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపా రపు వసంత ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణీలకు బాలింత లకు పౌష్టికారాన్ని పంపిణీ చేశారు, పౌష్టికాహారం తీసు కోవడం వల్ల కలిగే లాభాలను సర్పంచ్ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపారపు వసంత అంగన్వాడీ టీచర్లు, వకుల, శారద ఏఎన్ఎం ఆశా కార్యకర్త గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

మట్టి గణపతులతో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



బోయిన్ పల్లి ప్రభాత వార్త బోయిన్ పల్లి మండలం లోని నీలోజీ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ కు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులు మట్టి వినాయకుడిని అందజేశారు. ఈ సందర్భంగా నిలోజీ పల్లి గ్రామ సర్పంచ్ అను ముల భాస్కర్ మాట్లాడుతూ మట్టి వినాయ కులను పూజించాలని మట్టి వినాయకులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అని అన్నారు.గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు మాజీ రాజ్యసభ సభ్యుడు జోగిని పల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గత కొన్ని ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు అని కొనియాడారు.వారి సేవలు అమోఘం అని అన్నారు. పర్యావరణ పరిరక్షకుడు మాజీ రాజ్యసభ సభ్యుడు జోగిని పల్లి సంతోష్ కుమార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బత్తిని కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ లో డిజిటల్ క్రాప్ సర్వే



బోయిన్ పల్లి ప్రభాత వార్త బోయిన్ పల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు. గ్రామంలో వివిధ రకాల పంటలను సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత,మిగతా మండల అధికారులు పాల్గొన్నారు.



అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం

చందుర్తి : ప్రభాతవార్త చందుర్తి మండలం అనంతపల్లి. లింగంపేట అంగన్వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సీడీపీఓ సౌందర్య సూపర్వైజర్ శంకరమ్మ ఆదేశాల మేరకు పోషణ మాసం సందర్భంగా శనివారం పోషక విలువల గురించి అవగాహన కల్పించారు. అంగన్వాడి ఉపాధ్యాయులు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో అనంత పల్లె సర్పంచి చిలకబాబు. ఉప సర్పంచ్ సలంద్ర సుజాత అనిల్.వార్డు సభ్యులు ఐతం అంజయ్య. ఐతం లహరి శ్రీనివాస్.కంబాల లక్ష్మీ మొగ్గయ్య.కంబాల సతీష్. అంగన్వాడీ ఉపాధ్యాయులు బైరి లత. నాగలక్ష్మి. లక్ష్మి పిల్లల తాల్లులు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



బోయిన్ పల్లి ప్రభాత వార్త : రైతుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు న్యాయవాది కట్టెకోల లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేకమైన హామీలు ఇచ్చి అధికారం లోకి రాగానే రైతుల సమస్యలను మరిచిపోయిందని దుయ్య బట్టారు తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

మట్టి గణపతులతో పర్యావరణాన్ని పరిరక్షించండి

బోయిన్ పల్లి ప్రభాత వార్త బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించాలని మట్టి వినాయకులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అని విద్యార్థులు యువతకు పిలుపునిచ్చారు. మట్టి వినాయకుల ద్వారానే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ దోహద పడ్డ వారు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాజు, రమేష్, వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.





గణేష్ ఉత్సవాలను ప్రశాంత
వాతావరణంలో నిర్వహించాలి...

వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు..

ప్రభాత వార్త కోనరావుపేట : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు అన్నారు శనివారం కొనరావుపేట పోలీస్ స్టేషన్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించరు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన నియమలపై అవగాహన కల్పించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐ రవీందర్ ఎస్సై రామ్మోహన్ విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



శిథిలా వ్యవస్థలో
మల్లాపూర్ గ్రామపంచాయతీ

నూతన గ్రామపంచాయతీకి మోక్షం ఎప్పుడో?

బోయిన్ పల్లి ప్రభాత వార్త : బోయిని పల్లి మండలం మల్లాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరుకుంది గతంలో నూతన గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు కాగా ఇదే గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ నూతన గ్రామపంచాయతీ నిర్మించాడు తనకు ప్రభుత్వం నుండి రావలసిన బిల్లులు రాలేదని సాకుతో కాలయాపన చేస్తూ గత కొద్ది రోజుల క్రితం తూతూ మంత్రంగా నిర్మాణం పూర్తి చేశాడు లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి ప్రజలకు ఉపయోగపడాల్సిన గ్రామపంచాయతీ మాత్రం ఇప్పటివరకు ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన గ్రామపంచా యతీ ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం పైన మండల ఎంపీడీవో శ్రీధర్ గౌడ్ ను వివరణ కోరగా త్వరలోనే గ్రామ పంచాయతీ ప్రారంభం ఉంటుందని ఆయన తెలిపారు.

ఆలయ అభివృద్ధికి ప్రధాన కృషి చేస్తున్నాం

బోయిన్ పల్లి ప్రభాత వార్త బోయిన్ పల్లి మండలం లోని దేశాయిపల్లి గ్రామంలో గల పంచముఖ హనుమాన్ ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని దేశాయిపల్లి గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్య లక్ష్మి,శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచముఖ హనుమాన్ ఆలయం ప్రధాన ఆకర్షణగా మా గ్రామంలో ఉంది అని దీనిని నిరంతరం అభివృద్ధి పరుస్తున్నామని భవిష్యత్తులో కూడా మరింత అభివృద్ధి చేసేందుకు గ్రామస్తుల అందరి సహకారంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.



వేములవాడ వార్త



రాజన్న సన్నిధిలో వినాయక ఉత్సవాలు..

వేములవాడ ప్రభాతవార్త: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రధాన ఆలయంలో ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహించనున్నారు.భక్తుల దర్శనార్థం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ మండపంలో ప్రత్యేక గణపతి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పుష్పాలు, విద్యుద్దీపాలతో మండపాన్ని అలంకరిస్తున్నారు.ఏర్పాట్లను ఆలయ ఈవో రమాదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ రామ్ కిషన్ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించండి..

వేములవాడ ప్రభాతవార్త: మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన..



వేములవాడ ప్రభాతవార్త: వినాయక నిమజ్జనానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను క్రేన్‌లతో తొలగించే పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉప సర్పంచ్ వెంకటేష్ కు ఘన సన్మానం

బోయిన్ పల్లి ప్రభాత వార్త రాజన్న సిరిసిల్ల జిల్లా ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బోయినపల్లి మండలం తడగొండ ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్ ను పాలకవర్గం సభ్యులు, యూత్, వ్యవసాయ విద్యార్థులు, స్నేహితులు, బంధువులు ఘనంగా నివాసం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, అగ్రికల్చర్ విద్యార్థులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మంథని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడించిన రైతులు, బీజేపీ నాయకులు

24గంటల కరెంటు ఇస్తామని 7గంటలు కరెంటు ఇస్తున్న మంత్రిశ్రీధర్ బాబు రాజీనామా చేయాలనీ డిమాండ్

మంథని ప్రభాతవార్త: బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం లో భాగంగా శనివారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రైతులతో కలసి బీజేపీ నాయకులు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి పాల్గొన్నారు . ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు గోస కనిపించడం లేదా, 24గం కరెంటు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 7గంటల కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి అర్థం అవుతుంది, ఈకార్యక్రమంలోరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపక సత్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నియోజకవర్గ కో కన్వీనర్ నంపెల్లి రమేష్,మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్, సబ్బాని సంతోష్, కొయ్యడ సతీష్, పగే రంజిత్, కొండ్రు లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల



అధ్యక్షుడు ఎల్కా సదానందం,సీనియర్ నాయకు రాపర్తి సంతోష్,మట్ట శంకర్, మళ్లారపు అరుణ్,చిలువేరు సతీష్,విశ్వాతేజ,సామల అశోక్, భాన ుప్రకాశ్, తొట్ల రాజు రైతులు , సాదుల రమేష్, జాన్నే శ్రీనివాస్, రాజు, ఓదెలు, వెంకటేష్, రామూర్తి మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘాలు పూర్తిగా విఫలం

రామగిరి ప్రభాతవార్త కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని టీబీజీకేఎస్ ఆర్ జి త్రీ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య అన్నారు. తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం ఆర్జీ 3 ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య శనివారం ఉదయం షిఫ్ట్ సమయంలో ఏ ఎల్ పి గని కార్మికులను మ్యానువే వద్ద కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. కనీసం డ్రిల్ బిట్స్, పనిముట్లు లేని పరిస్థితుల్లో కార్మికులు పనిచేయవలసి వస్తుందని. రక్షణ పరికరాలైనా షూస్, గ్లౌస్ సకాలంలో అందించడం లేదని , పని స్థలాలు మెరుగుపరచడం లేదని ఇంకా పలు సమస్యలు తెలుపుతూ కార్మికులు వాపోయారు. ఈ కార్యక్ర మంలో కేంద్ర సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్ పటేల్, కేంద్ర కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్ పటేల్, గట్టు శ్రీనివాస్, గని ఫిట్ సెక్రటరీ వి.వి గౌడ్, పూసల శేఖర్,పాశం శ్రీనివాసరెడ్డి, పేర్క రమేష్, దాసరి మల్లేష్, కొప్పుల సురేష్, పిట్టల సది , రెండ్ల సందీప్, రాజేష్, వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



మనసును, శరీరాన్ని ఏకం చేసేదే యోగ

రామగిరి ప్రభాతవార్త మనసును, శరీరాన్ని ఏకం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేదే యోగ అని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో శ్రీ పరివార్ యోగా వారి ఆధ్వర్యంలో యోగా గురుజి రఘు సింగ్ బాపూజీ యోగ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి యోగాసనాలు, వాటి ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, విభాగధిపతులు బి.సుదర్శనం, సి.జె.సురేఖ, కె.ఐలయ్య, అఫ్సర్ పాషా, ఆర్.రాజేశ్వరి, షబ్బీరుద్దీన్, మాజీ అధికారి ఇ.లక్ష్మీనారా యణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండవేన

రామగిరి ప్రభాతవార్త రామగిరి మండలం నాగ పల్లి గ్రామానికి చెందిన కొండవేన సుమంత్ ఎన్ ఎస్ యు ఐ నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ను కార్యాలయంలో కొండవేన సుమంత్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన సుమంత్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పటిష్టతకు, విద్యార్థి విభాగం అభివృద్ధికి నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, మాజీ సర్పంచ్‌లు తీగల సమ్మయ్య, ఎరుకల బాపురావు, యూత్ నాయకులు మట్ట రాజ్ కుమార్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘాల పదవీకాలం ముగిసింది

అన్ని యూనియన్లకు సమాన హోదా కల్పించాలి

ఆర్జీ త్రీ ఏపీఏ జీఎంలకు టీబీజీకేఎస్ వినతి

రామగిరి ప్రభాతవార్త సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టీయూసీల పదవీకాలం ఈనెల 8వ తేదీన ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించేం తవరకు సింగరేణిలోని అన్ని యూనియన్లకు కమిటీల నిర్వహణ మరియు ఇతర అంశాలలో సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆర్ జి 3 డివిజన్ జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సూచన మేరకు ఆర్జీ త్రీ, ఏపీఏ సెంట్రల్ కమిటీ, డివిజన్ కమిటీ, పిట్ కమిటీల నాయకులు శనివారం జి ఎం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ 2023 డిసెంబర్లోనే ఆర్ఎల్సి నేతృత్వంలో రెండు సంవత్సరాలకాల పరిమితితో ఎన్నికలు నిర్వహించడం జరిగిందని గెలుపొందిన సంఘాలు వివిధ కారణాల చేత 9 నెలలు ఆలస్యంగా గెలుపొందిన పత్రాన్ని సైతం రెండు సంవత్సరాల పరిమితితోనే తీసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈసంపల్లి రమేష్ ,సెంట్రల్ కమిటీ నాయకులు గట్టు శ్రీనివాస్, పాశం శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి శ్రీకాంతరావు, ఎల్ పి ఫిట్ సెక్రెటరీ వివి గౌడ్, సిహెచ్పి ఇన్చార్జ్ బుద్దే ఉదయ్,ఓసి టు అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ వీరగోని సంతోష్ గౌడ్, డివిజన్ కమిటీ నాయకులు అల్లం తిరుపతి, దాసరి మల్లేష్, పూసాల శేఖర్, మాదాసి చంద్రయ్య,దద్దెడ చంద్రశేఖర్, దూల కంటి రాఘవరెడ్డి,కొప్పుల సురేష్, పెరిక రమేష్ ,టి వెంకటేష్, టి కుమార్, సుధాటి సుగుణాకర్ రావు, చింతపట్ల సతీష్, నీలం సంపత్ పాల్గొన్నారు.

పద్మ శాలి సంఘం ఆధ్వర్యంలో మంథని మున్సిపల్ చైర్మన్ కు సన్మానం

మంథని ప్రభాతవార్త: హైద రాబాద్ పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో ఇటీవల మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికైన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్ర మంలో మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వొడ్నాల శ్రీనివాస్ ను పద్మశాలి సంఘం నాయకులు, కుల బాంధవులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరభద్ర అనిల్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్ గూడెం వెంకటరమణ, ఎల్. రమణ,గుండు సుధారాణి, పెద్దపల్లి జిల్లా చైర్మన్ వలస నీలయ్య, మాజీ సర్పంచ్ భీముని వెంకటస్వామి, సర్పంచ్ నాగుల రాజయ్య, మాజీ సర్పంచ్ రామ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరై వొడ్నాల శ్రీనివాస్ గారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మశాలి సంఘం నాయకులకు, కార్యక్రమంలో పాల్గొన్న కుల బాంధవులకు వొడ్నాల శ్రీనివాస్ కృతజ్ఞతాభినందనలు తెలిపారు.



మంథని వార్త

రూ.2.50లక్షల ఎల్ ఓ సి అందజేత



ముత్తారం, ప్రభాతవార్త: ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన శీలం అజయ్ అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా సిఎం ఆర్ ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వం నుంచి సి ఎం ఆర్ ఎఫ్ కింద రూ.2.50లక్షల ఎల్ ఓ సి మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆసుపత్రి సహాయకుడు ఈ ఎల్ ఓ సి శీలం అజయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్ ఓ సి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా అజయ్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి విగ్రహాలనే పూజించండి జి.యంలు



రామగిరి ప్రభాతవార్త మట్టి వినాయక విగ్రహాలను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. శనివారం జి.యం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అందరూ కూడా మట్టితో తయారైన వినాయక విగ్రహాలనే పూజిస్తూ భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రులను ఘనంగా జరుపుకోవాలన్నారు. అందరికీ పండగ శుభాకాంక్షలుతెలి యజేశారు. అదేవిధంగా సోమవారం ఉదయం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ఆవరణలో సెంటినరీ కాలనీ వాసులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, రవి కుమార్, ఏరియా ఇంజనీర్ ఎ. ఉదయ భాస్కర్, పర్యవరణ అధికారులు కిషన్, ప్రశాంత్ జీవన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, తోపాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలి



రామగిరి ప్రభాతవార్త మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సౌజన్యంతో.. అలీఫ్ సంస్థ వారి ఆధ్వర్యంలో రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో గత మే నెలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ విజ యవంతంగా ముగిసింది. శుక్రవారం రాజా పూర్ సర్పంచ్ పుల్లేల భాగ్యలక్ష్మి కొమురయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యూత్ అ ధ్యక్షులు శ్రీనివాస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నూరి వెంకటి వార్డు మెంబర్స్ కాల్వ రజిత, పుల్లేల సుజాత, కన్నూరి శశి కుమార్, ఎండి ఆఫీస్, కాదాసి ఓదమ్మ,నాయకులు మాటేడి రవి, కన్నూరి పర్వతాలు, శ్రీనివాస్, తిరుపతి,రోహిత్ ,తిరుపతి, మల్లేష్, నాగరాజు, పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరు

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టులపై

యలమల గోపీచంద్ ఆగ్రహం.



దేవరకొండ, సెప్టెంబర్ 12, ప్రభాత వార్త : విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర శాఖ నాయకులు,కార్యకర్తలను ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ యలమల గోపీచంద్ తీవ్రంగా ఖండించారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శనివారం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి కార్య క్రమాన్ని చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో, కార్యక్రమాన్ని అడ్డుకునే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. అర్ధరాత్రి వేళల్లో విద్యార్థి నాయకుల ఇళ్లకు వెళ్లి వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువ లకు విరుద్ధమన్నారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలను ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఏబీవీపీ ఎప్పటినుంచో విద్యార్థుల హక్కుల పరిరక్షణ, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల విడుదల, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధుల చెల్లింపు, హాస్టళ్ల సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు నిర్వ హిస్తోందని తెలిపారు.అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థుల ఉద్యమస్ఫూర్తిని అణచివేయలేరని గోపీచంద్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏబీవీపీ తన ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.ఈ ముందస్తు అరెస్టుల్లో కటకం ప్రవీణ్, ఎయిర్‌టెల్ మహేందర్ తదితరులు ఉన్నట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.

గాజుల అభినవ్ రాజ్ సంస్కరణ సభలో టీవీఎన్ రెడ్డి

చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి.



దేవరకొండ, సెప్టెంబర్ 12, ప్రభాత వార్త : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు తమ్ముడు గాజుల రాజేష్ కుమారుడు గాజుల అభినవ్ రాజ్ సంస్కరణ సభలో దేవరకొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, కొండమల్లెపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమావత్ దాస్రు నాయక్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజుల అభినవ్ రాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం టీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాజుల అభినవ్ రాజ్ మృతిచెందడం అత్యంత బాధాకరమన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులు,బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. అభినవ్ రాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని,ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నీల రవికుమార్, కౌన్సిలర్ పొట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు ఎండీ జనీబాబ్, సోషల్ మీడియా కన్వీనర్ వాజిద్ పాషా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఆడెపు సతీష్

పెద్ద అడిసర్లపల్లి,12 సెప్టెంబర్,ప్రభాతవార్త:



ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షుడిగా ఆడెపు సతీష్ మాదిగ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు రాష్ట్ర సమన్వయకర్త చౌదరి మడుపు శ్రీను మాదిగ నియామక పత్రాన్ని అందజేశారు. శనివారం నాడు అంగడిపేట లోని ఎస్ఎల్బీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాదిగల సమ్మేళన కార్యక్రమంలో ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆడెపు సతీష్ మాట్లాడుతూ మందకృష్ణ నాయకత్వంలో మాదిగ జాతి కోసం అన్నివేళలా కష్టపడుతూ మండలంలోని అసమానదులను తొలగవేస్తూ ఏ ఒక్కరికి ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందుకు వెళ్తానని ఆయన అన్నారు. మాదిగల హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం సంస్థను మండలంలో మరింత బలోపేతం చేస్తానని సతీష్ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. మండల అధికార ప్రతినిధిగా రమణపల్లి వెంకటయ్యను, ఉపాధ్యక్షులుగా పోతే సైదయ్య మేకల ఎర్రబాబు ప్రధాన కార్యదర్శిగా మద్దిమడుగు ఉదయ రమణమ్మపల్లి యాదగిరి ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ మారుపాకుల గోపాల్, కరుణాకర్, ఫ్రాన్సిస్,మద్దిమడుగు ముత్తయ్య,ధర్మపురం శ్రీను, రమణంపల్లి సైదులు,మార్కయ్య,సాయి బాబురావు, రవి, రామయ్య పాల్గొన్నారు.

గుడిపల్లిలో మండలంలో మేగా ఉచిత శిబిరం

500 మందికి ఉచిత వైద్య సేవలు

పెద్ద అడిశర్లపల్లి.12 సెప్టెంబర్, ప్రభాతవార్త: నల్లగొండ జిల్లా గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నాడు మెగా ఉచిత శిబిరం ఘనంగా నిర్వహించారు.గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూనెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రముఖ యశోద హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్లు వీరారెడ్డి,ఆర్థో నిపుణులు అమీరా గైనకాలజిస్ట్, మధుర దుర్గా, వారి బృందం గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు.ఈ క్యాంప్ లో భాగంగా కంటి పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు గైనక్ పరీక్షలు, నిదిబి, తీశి, షుగర్ పరీక్షలు పూర్తి ఉచితంగా నిర్వహించారు. అంతేకాకుండా అవసరమైన వారికి కళ్ళద్దాలు, మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఒకవేళ ఎవరికైనా మేజర్ హెల్త్ ప్రాబ్లం ఉంటే, క్యాంప్ లో ఇచ్చిన వీశి స్లిప్ తీసుకువస్తే యశోద హాస్పిటల్ లో 20 డిస్కౌంట్ ఇస్తామని వైద్యులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ కూనెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "మా గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం అడగగానే ఉచిత క్యాంప్ నిర్వహించడానికి ముందుకు వచ్చిన యశోద హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ఒక్కరోజే దాదాపు 500 మంది గ్రామస్తులు ఈ సేవలను వినియోగించుకున్నారు. మా ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ముందు జాగ్రత్తగా ఈ చెకప్ లు చేయిస్తున్నము అన్నారు,



జాతీయ లోక్ అదాలత్ నిర్వహన

నల్గొండ టౌన్ సెప్టెంబర్ 12, ప్రభాత వార్త:



రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నల్లగొండ వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా లోని అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడింది. ఈ లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ లోక్ అదాలత్ లో 33 సివిలు, 2813 క్రిమినలు, 68 మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 9281ట్రాఫిక్ చలాన్ కాసులు, 77 బ్యాంకు రికవరీ కేసులు 11 సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం - 12283 (పెండింగ్ , ప్రిలిటిగేషన్) కేసులు పరిష్క రించబడినవి. ఇందులో ప్రమాద భీమా కేసులలో రూ.7,62,44,348/ నష్టపరిహారం ఇప్పించగ, బ్యాంకు రికవరీ 6217000/, ట్రాఫిక్ చలాన్ 31,32,180/, మరియు సైబర్ క్రైమ్ కేసులలో రూ.117262/ రికవరీ డబ్బులు యిప్పించడం జరిగింది. ఈ కార్యక్రమములో జిల్లా జడ్జి మరియు చైర్మన్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వసంత్, కార్యదర్శి హిమబిందు గొల్ల , ఇతర న్యాయ మూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సతీష్ కుమార్, బి.అశోక్ కుమార్, ఇతర న్యాయవాదులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ ఇతర ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫీసర్స్, కక్షిదారులు సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం

నల్గొండ టౌన్ సెప్టెంబర్ 12, ప్రభాత వార్త:



నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులందరికీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి గణేష్ ఉత్సవ నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు డీఎస్పీ స్పష్టంగా తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. అలాగే శాంతి భద్రతలు మరియు ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ శివ రామ్ రెడ్డి నల్గొండ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నల్గొండ టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి, నల్గొండ వన్ టౌన్ ఎస్సై లు జి ముత్తయ్య, జూకూరి సైదులు, నల్గొండ టూ టౌన్ ఎస్ఐ దొంగరి సైదా బాబు, రూరల్ ఎస్ఐ శివ ప్రసాద్, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శిగా ఆడవత్ సర్దార్ నాయక్

నార్కట్ పల్లి ప్రభాతవార్త సెప్టెంబర్ 12 దామరచర్ల మండలం జైత్రం తండాకు చెందిన ఆడవత్ సర్దార్ నాయక్ తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు యాదవల్లి వెంకటస్వామి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా సర్దార్ నాయక్ నియామక ఉత్తర్వులను అందుకున్నారు.ఈ సందర్భంగా సర్దార్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ఎన్ ఎస్ యు ఐ నాయకత్వానికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డు సమర్పించాలి..

ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి.. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్..



తంగళ్ళపల్లి ప్రభాత వార్త : ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తంగళ్ళపల్లి మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న 185, 186, 187, 188, 189, 190, 191 పోలింగ్ బూత్ లలో బీఎల్ఏ సమక్షంలో బూత్ లెవెల్ అధికారులు చేపడుతున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి సంబంధిత బీఎల్ఓ లకు సమర్పించాలని అన్నారు. అక్టోబర్ 1, 2026 వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులు ఎంత మంది ఓటు హక్కు కోసం చేసిన దరఖాస్తుల వివరాలతో పాటు, నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. మండలంలో ఉన్న అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో 9,712 అనామలీస్ ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులతో పాటు సంబంధిత బీఎల్ఏ లు నోటీసులు అందిన ఓటర్లకు అవగాహన కల్పించి, తమ ధృవీకరణ పత్రాలు సమర్పించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలని, సంబంధిత తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్ వైజర్లు అందుబాటులో ఉండి బీఎల్ఓ లకు సూచనలు అందిస్తూ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరికీ బాధ్యతా : సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్



మెట్ పల్లి టౌన్,ప్రభాత వార్త: పర్యావరణ పరిరక్షణ కోసం ఉచితంగా మట్టి గణపతులు పంపిణి చేయడం అభినందనీయం అని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ అన్నారు. తుల గంగవ్వ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మెట్ పల్లి కోర్టులో న్యాయవాదులకు ఉచిత మట్టి గణపతుల పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, మట్టి గణపతుల్ని పంపిణి చేసిన ఆయన మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. తుల రాజేందర్ గారూ, మట్టి గణపతుల్ని పంపిణి చేయడం అభినందనీయం అన్నారు. న్యాయవాదులు కూడా మట్టి గణపతులు పూజించి, ప్రజలకు ఆదర్శంగా ఉండటం శుభ పరిణామం అన్నారు. భవిష్యత్తులో కూడా ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం టీ తాగడానికి 150 స్టీల్ గ్లాసుల్ని బార్ అసోసియేషన్ కి రాజేందర్ వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, వడ్డేపల్లి శ్రీనివాసన్, యండి వల్లియొద్దీన్, గంద్ర ప్రవీణ్ రావు, బర్ల లక్ష్మణ్, దండబోయిన యాదగిరి, ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, మ్యాన నరహరి, నేరెళ్ల శ్రీధర్, జేడి సుధాకర్, పసునూరి శ్రీనివాస్, కాజీపేట ప్రవంతి, ఉడుతా ప్రశాంత్, గురిజెలా గోపి, అందె సంజయ్, రజిత పాల్గొన్నారు.

ఉచితంగా చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు

18 మంది చిన్నారులకు గుండెకు పునర్జన్మ

లండన్ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశంసలు

నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు..

చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సీఎం సానుకూలం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: చిన్నారులకు గుండె శస్త్ర చికిత్స అమలు కు కార్యరూపం చేపట్టే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. లండన్‌లో వైద్య వృత్తిని కొనసాగిస్తున్న రమణారావు తన వైద్య బృందంతో కలిసి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో తాజాగా 18 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,సలహాదారు, మాజీ ఆరోగ్యశాఖ మంత్రి సుదర్శన్ రెడ్డితో కలిసి లండన్ నుంచి వచ్చిన వైద్య బృందంతో సమావేశమై చిన్నారుల వైద్య సేవలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. జగిత్యాల జిల్లాకు చెందిన రమణారావు దన్నపునేని గత ఏడేళ్లుగా లిటిల్ హార్ట్ ఫౌండేషన్ ద్వారా గుండె వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. లండన్ నుంచి పదిమంది వైద్య నిపుణులు, సిస్టర్లతో కూడిన బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిమ్స్ ఆస్పత్రుల్లో కిమ్స్ ఆసుపత్రులలో ఇప్పటివరకు సుమారు 200 మంది చిన్నారులకు గుండెకు సంబంధించిన పరీక్షలు చేసి 18 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. ఈ విడతలో గత ఆరు రోజులుగా నిమ్స్‌లో సుమారు 200 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో అవసరమైన 18 మందిని గుర్తించి గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.అందులో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చేశారని తెలిపారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిన్నారులకు గుండె శస్త్రచికిత్స చేయించాలంటే సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంతటి భారీ వ్యయాన్ని భరించలేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం ఎంతో గొప్ప సేవ అని అన్నారు. చిన్నారుల ప్రాణాలను కాపాడటంతో పాటు వారి కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు నిమ్స్‌లో ఇటువంటి గుండె శస్త్రచికిత్సలు మరింత విస్తృతంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.శనివారం నిమ్స్ చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ అమరేశ్వరరావు, రమణారావు దన్నపునేని, ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డితో సుమారు గంటన్నర పాటు సమావేశమై చిన్నారుల గుండె వైద్యానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. చిన్నారుల గుండె వ్యాధులకు సంబంధించి నిమ్స్‌లో , టిమ్స్ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.తాజాగా శస్త్రచికిత్సలు చేయించుకున్న 18 మంది చిన్నారుల్లో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు దళిత చిన్నారులు కూడా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. వారి గుండె ఆపరేషన్ల కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున 3 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.రమణారావు దన్నపునేని తన సొంత ఖర్చులతో లండన్, అమెరికా తదితర దేశాల నుంచి వైద్య నిపుణుల బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిరుపేద చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. డబ్బు లేక వైద్యం అందక చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా, వారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రమణారావు చేస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. నిరుపేద చిన్నారులకు గుండెకు సంబంధించిన అత్యాధునిక వైద్యం అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిమ్స్ వైద్య బృందం, రమణారావు దన్నపునేని, ఆయన వైద్య బృందానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.





పక్కా ప్రణాళికతోనే విజయం...

ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం, పక్కా ప్రణాళికే విజయానికి మూలసూత్రాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఎస్సై, కానిస్టేబుల్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి, సందేహాలుంటే నిపుణులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనలను వీడి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ విధానం, సమయపాలన, వ్యూహాలు, శారీరక దారుఢ్య పరీక్షలపై నిపుణులు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా పోలీస్ ట్రైనర్ డా. విజయ రఘు రామరాజు, విషయ నిపుణులు మహేష్ కుమార్, నవీన్ సుందర్, అమరేష్, పోలీసు అధికారులు, పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.



ఘనంగా జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు....

ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో ఉత్సాహంగా పోటీలు

సుల్తానాబాద్, ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సుల్తానాబాద్ మండల ఎంఈఓ రాజయ్య, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో శనివారం పెద్దపల్లి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా నిర్వహించారు.పోటీలను ఎంఈఓ రాజయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, పీఈటీ కార్యదర్శి దాసరి రమేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పోటీల అనంతరం విజేతలకు పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్ తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా, సరస్వతి, ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సత్యనారాయణ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్తదానం

43వ సారి రక్తదానం చేసిన నరేష్

చొప్పదండి,ప్రభాతవార్త: కరీంనగర్ ఆసుపత్రి లో అత్యవసర సమయంలో పేషంట్ కు రక్తం అవసరం కాగా శనివారం చొప్పదండి మండలం లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, బ్లడ్ డొనేషన్ మోటివేటర్, సామాజిక కార్యకర్త గొల్ల పెల్లి నరేష్ తన బి నెగటివ్ రక్తాన్ని 43వ సారి రక్త దానం చేశారు. రక్తం ఎక్కడ కూడా కృత్రిమంగా తయారు చేయలేము కాబట్టి అత్యవసర సమయంలో రక్త దానం చేయడం విలువైన ప్రాణాలు కాపాడ గలుగుతాము. అలాగే ప్రతి ఒక్క యువకుడు మూడు నెలలకి , అలాగే పెళ్ళి రోజులు, పుట్టిన రోజుల సందర్భంగా కూడా స్వచ్ఛందంగా ముందుకి వచ్చి రక్త దానం చేసి విలువైన ప్రాణాలని కాపాడాలని నరేష్ కోరారు.

